

అయ్యప్పలకు ముస్లింల అన్నదానం

మాలధారులకు భోజనం వడ్డిస్తున్న ముస్లింలు


సోమందేపల్లిలోని మారుతీనగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం గంగపూజ చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారులకు ముస్లింలు అన్నదానం చేసి, మతసామరస్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు. -ఆంధ్రజ్యోతి, సోమందేపల్లి

ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 27.0 కనిష్ఠం : 18.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శనివారం 6 డిసెంబరు 2025

అలరించిన స్వరార్చన



పాటలు పాడుతున్న సింగపూర్ భక్తులు

పుట్టపర్తి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సింగపూర్ భక్తులు శ్రీసత్యసాయి స్వరార్చన పేరిట చేపట్టిన బృందగానం భక్తులను అలరింపజేసింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శుక్రవారం రాత్రి మధురగానంతో మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రష్యా భక్తుల పర్తియాత్ర

రష్యా భక్తులు పర్తియాత్ర పేరుతో శుక్రవారం ప్రశాంతినిలయం చేరుకున్నారు. రెండురోజులపాటు సాయికుల్వంత్ సభామండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

భక్తరహళ్ళి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన భూతప్పల ఉత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కోరికలు నెరవేరాలనీ, దీర్ఘకాలిక వ్యాధులు నయమవాలని పెద్ద సంఖ్యలో భక్తులు.. భూతప్పలు వచ్చే దారిలో పడుకున్నారు. వారి పైనుంచి భూతప్పలు నాట్యం చేసుకుంటూ వెళ్లారు. (వివరాలు 6లో..)



భక్తులపై నాట్యం చేస్తూ వస్తున్న భూతప్పలు

భక్తిపారవశ్యం

గులాబీ గుబులు

- పత్తి పంటలో ఉధృతంగా గులాబీ రంగు పురుగు
- మందులు పిచికారీ చేసినా ప్రయోజనం శూన్యం
- ఆందోళనలో రైతులు



6

హత్యకేసు ఛేదింపు

నలుగురు నిందితుల అరెస్టు

7

అప్పుల ఉరికి నేతన్న బలి

డీజిల్ దందా

పురానికి అక్రమంగా కర్ణాటక డీజిల్

- రోజూ 10వేల లీటర్లుపైగానే..
- అక్రమార్కులకు కలిసి వస్తున్న ధర వ్యత్యాసం
- చోద్యంచూస్తున్న అధికారులు



రాత్రిపూట డీజిల్ తరలిస్తున్న వాహనం



హిందూపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): డీజిల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. కర్ణాటక నుంచి నిత్యం డీజిల్‌ను హిందూపురానికి అక్రమంగా తెస్తున్నారు. హిందూపురానికి చెందిన వ్యక్తులు కర్ణాటకలో పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలో కంటే కర్ణాటకలో ధరలు తక్కువగా ఉండటంతో నిత్యం 10వేల లీటర్లకుపైగా డీజిల్ తీసుకొచ్చి, విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా నిత్యం వేలాది లీటర్ల డీజిల్‌ను అక్రమంగా విక్రయించడంవల్ల స్థానిక పెట్రోల్ బంక్ యజమానులు ఇబ్బంది పడుతున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో (మిగతా 6వ పేజీలో...)

పేద విద్యార్థులకు చేయూత

పది పరీక్షల ఫీజు చెల్లించిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



ఎంఈఓలకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చేయూతనిచ్చారు. పదో తరగతి పరీక్షా ఫీజును చెల్లించారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో పదో తరగతి పరీక్షా ఫీజు సంబంధించిన చెక్కులను ఎంఈఓలకు ఎమ్మెల్యే శుక్రవారం అందజేశారు. ప్రస్తుతం 2025-2026 సంవత్సరం రెగ్యులర్‌తోపాటు కంపార్ట్‌మెంటల్ 2,881 మంది విద్యార్థులకు రూ.3.60లక్షలు ఫీజుకు సంబంధించిన చెక్కులు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదన్నారు.

బోగస్ ధ్రువపత్రాలపై ఉన్నతాధికారులకు నివేదిక

మడకశిరటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అగళి మండలం కొమరేపల్లి సచివాలయం నుంచి 3,981 బోగస్ జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంపై ఎంపీడీఓ గంగాధర్ విచారణ చేపట్టి, శుక్రవారం జిల్లా పౌర సంబంధాల శాఖాధికారికి నివేదిక సమర్పించారు. బోగస్ ధ్రువపత్రాల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. దీనిపై విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి లాగిన్ నుంచి ఏకంగా జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తున్నట్లు ఏకంగా 3,982 ఓటీపీలు వచ్చాయి. వాటిలో 3,981 జారీ చేశారు. దీనిపై అగళి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ నివేదిక సమర్పించడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

బడిలో పండుగ

- అట్టహాసంగా మెగా పీటీఎం ● ఉత్సాహంగా హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు ● ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



విద్యార్థినులతో సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి సవిత



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సభా వేదికలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మానాన్నతో కలిసి విద్యార్థుల భోజనాలు, ప్రదర్శనలతో బడిలో పండుగ వాతావరణం కనిపించింది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం మెగా పీటీఎం అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, కలెక్టర్ శ్యాంప్రసాద్‌పాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకాగా.. విద్యార్థుల తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం అత్యంత వైభవంగా సాగింది. కూటమి ప్రభుత్వంలో విద్యారంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల శ్రద్ధ, ఉపాధ్యాయుల బాధ్యతపై ప్రసంగాలు చేశారు. సోమందేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎంలో మంత్రి సవిత పాల్గొని, మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను వివరించారు. లేపాక్షిలో నీలం సంజీవరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించి, వారి తల్లిదండ్రులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. తనకల్లు మండలం గిరిజన మోడల్ పాఠశాలతోపాటు కదిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. పుట్టపర్తి మండలం బీడుపల్లి, అమడగూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సమావేశాలకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి హాజరయ్యారు. మడకశిర బాలిక గురుకుల పాఠశాల, గుడిబండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు పాల్గొన్నారు.



మడకశిరలోని ఆదిరెడ్డిపాళ్యం ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



విద్యార్థినికి ప్రోగ్రెస్ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి



తనకల్లు మండలం సీజీ ప్రాజెక్టు గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో సెల్ఫీ తీసుకుంటున్న ఎమ్మెల్యే కందికుంట

అంతా అస్తవ్యస్తం!

- మద్దతు ధరతో పత్తి కొనుగోలుపై నిర్లక్ష్యం
- తాడిపత్రిలో కేంద్రాన్ని ప్రారంభించని వైనం
- కొత్త యాప్‌తో రైతుల ఇబ్బందులు
- సమస్యలు పరిష్కరించే నాథుడు కరువు
- అయోమయంలో రైతులు

అనంతపురంఅర్బన్/తాడిపత్రి/గుత్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రారంభించిన పత్తి కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. ఈ ఏడాది కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌ను తీసుకురావడమే గందరగోళానికి కారణమవుతోంది. గతంలో ఈ-క్రాప్ బుక్ చేసుకున్న రైతులతో సీఎం యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకుని కొనుగోలు కేంద్రాల్లో పత్తి కొనేవారు. అయితే ఈ ఏడాది రైతులు పత్తి విక్రయించేందుకు కపాస్ కిసాన్ యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని షరతు పెట్టారు. నిర్దేశించిన తేదీల్లోనే యాప్ ద్వారా రైతులు స్లాట్ బుక్ చేసుకోవాలన్న నిబంధన విధించారు. రైతు సేవాకేంద్రాల్లో సిబ్బంది ఈ ప్రక్రియ చేయాల్సి ఉండగా, కొత్త యాప్ సక్రమంగా పనిచేయడంలేదని, రైతులు సెల్ ఫోన్లల్లో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పేర్లు నమోదు చేసుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారు. దీంతో (మిగతా 6లో..)



తాడిపత్రి మార్కెట్ యార్డులో ప్రారంభానికి నోచుకోని కొనుగోలు కేంద్రం

వారానికి ఒక రోజే కొనుగోలు

గుత్తి మార్కెట్ యార్డులో వారానికి ఒక రోజు మాత్రమే పత్తి కొనుగోలు చేయాలని సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారులు నిర్ణయించారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతనెల 28న స్లాట్ బుకింగ్‌కు అవకాశం ఇచ్చారు. ఈ సమయంలో పెద్దవడుగూరుకు చెందిన 16 మంది యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారు. వీరిని ఈనెల 3న కొనుగోలు కేంద్రానికి రావాలని యాప్ ద్వారానే సమాచారం అందించారు. వీరిలో 14 మంది రైతులు పత్తిని గుత్తి మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లారు. ఇందులో ఏడుగురు రైతులతో 255 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. మిగిలిన రైతులకు చెందిన 250 క్వింటాళ్ల పత్తి నాణ్యతగా లేదని తిరస్కరించారు. బాధిత రైతులు నిరసన వ్యక్తం చేసినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. తిరిగి ఈనెల 4న యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. ఇప్పటి దాకా 18 మంది రైతులు స్లాట్ బుక్ చేసుకున్నారు. వీరికి ఈనెల 10న కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకురావాలని యాప్ ద్వారా సమాచారం ఇచ్చారు. యాప్‌పై అవగాహన ఉన్న రైతులకు మాత్రమే ఈ సమాచారం తెలిసే అవకాశం ఉంది. మిగతా రైతులకు ఏఏ తేదీల్లో స్లాట్ బుక్ చేసుకోవాలి..? ఏయే తేదీల్లో కేంద్రానికి పత్తిని తీసుకువెళ్లాలన్న సమాచారం తెలియని దుస్థితి నెలకొంది.

కంబదూరం

- పని చేయడానికి జంకుతున్న సెక్రటరీలు
- పంచాయతీల్లో అక్రమాల నేపథ్యంలోనే వెనుకంజ
- కంబదూరు మండలం నుంచి డెప్యుటేషన్‌పై వెళ్లే యత్నం

7

హైవేల జంక్షన్..!



కోడూరు నుంచి పుట్టపర్తికి వెళ్లే 342వ జాతీయ రహదారి

- కోడూరు కేంద్రంగా జాతీయ రహదారులు ప్రారంభం
- వేగంగా గ్రీన్‌ఫీల్డ్, 342 జాతీయ రహదారుల పనులు
- అభివృద్ధి కేంద్రంగా మారనున్న కోడూరు

చిలమత్తూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పథంలో భాగంగా మండలంలోని కోడూరు గ్రామ రూపురేఖలు మారుతున్నాయి. ఎప్పటి నుంచో కోడూరు తోపు పచ్చదనానికి, ఆహ్లాదకర వాతావరణానికి కేరాఫ్‌గా ఉంటోంది. అలాంటి ప్రాంతం ప్రస్తుతం రాష్ట్రంలోనే పెద్ద జాతీయ రహదారులకు పుట్టినిల్లుగా మారుతోంది. దీంతో కోడూరు రూపురేఖలు మారనున్నాయి. కోడూరు 44వ జాతీయ రహదారి పక్కనే ఉండటంతో ఇప్పుడు ఈ ప్రాంతం మరో రెండు జాతీయ రహదారులకు ప్రారంభ నిలయంగా మారుతోంది. ఇక్కడి నుంచే రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన గ్రీన్‌ఫీల్డ్ హైవే పురుడుపోసుకుంటోంది. అదేబాటలో మరో జాతీయ రహదారి 342 కూడా ఇక్కడి నుంచే ప్రారంభమవుతోంది. దీంతో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. 544-ఇ జాతీయ రహదారి కూడా కొడికొండ చెక్‌పోస్టు నుంచి ప్రారంభం కావడంతో ఈ ప్రాంతం జాతీయ రహదారులకు పుట్టినిల్లుగా మారిందనే చెప్పవచ్చు.

44వ జాతీయ రహదారి

కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశంలోనే అతి (మిగతా 6లో..)



భక్తి పారవశ్యం

● వైభవంగా భూతప్పల ఉత్సవం ● వేలాదిగా తరలివచ్చిన భక్తులు

జ్యోతులతో నరసింహస్వామి ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, నరసింహస్వామి, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న అర్చకులు



మడకశిర రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం భూతప్పల ఉత్సవం, జ్యోతుల పరుష వైభవంగా నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపుగా నరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ స్వామికి పూజలు చేశారు. అనంతరం భూతప్ప ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో అర్చకులు ముందుగా వెళ్తున్నారు. వెనకాలే నాట్యం చేసుకుంటూ భూతప్పలు కదిలారు. భూతప్పల పాదస్పర్శతో కోరికలు తీరుతాయనీ, రోగాలు నయమవుతాయని భక్తుల విశ్వాసం. దీంతో వందలాది మంది భక్తులు భక్తితో భూతప్పలు వచ్చే దారిలో పడుకున్నారు. వారిపై నాట్యం చేసుకుంటూ భూతప్పలు వెళ్లారు. గంటపాటు సాగిన ఈ ఉత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిగా తరలివచ్చారు. అనంతరం నరసింహ స్వామిని దర్శించుకున్నారు.

జ్యోతుల పరుష

తెల్లవారుజామునే జ్యోతుల పరుష ప్రారంభమైంది. మొక్కుబడి ఉన్న వారు జ్యోతులను తయారుచేసి, వాటిని తలపై పెట్టుకుని, స్వామి నామస్మరణ చేసుకుంటూ కాలినడకన జిల్లేడగుంటకు చేరుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయ ప్రదక్షిణ అనంతరం భక్తరహళ్ళికి వచ్చారు. నరసింహస్వామి ఆలయ ప్రదక్షిణ చేసి, మొక్కులు తీర్చుకున్నారు. రైతులు పండించిన వేరుశనగ, వరి, అరటిపండ్లను స్వామివారి ఆలయంపై వేశారు. ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, 200 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

మంచి పత్తినే తీసుకురండి

● మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్



రాఘవేంద్రకుమార్, ఏడీ, మార్కెటింగ్ శాఖ

అనంతపురంరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పత్తిని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రానికి వెళ్లే రైతులు పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ సూచించారు. ఆమేరకు శుక్రవారం ఆయన పత్తి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. జిల్లాలోని రైతులు పండించిన పత్తిని గుత్తిలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పత్తిని బాగా ఆరబెట్టి శుభ్రంగా తీసుకురావాలన్నారు. వర్షం వలన తడిసిన పత్తిని తీసుకురావద్దన్నారు. దుమ్ము, ధూళి లేకుండా చూడాలన్నారు. చెత్త, చెదారం కలిసిన పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకురావద్దని సూచించారు. రంగు మారిన, పురుగు పట్టిన కాయలను వేరు చేసి మంచి పత్తినే తీసుకురావాలన్నారు. నీళ్లు చల్లిన, పాత పత్తిని సీసీఐ కొనుగోలు చేయదన్నారు. కౌడు పత్తి, ముడుచుకుపోయిన పత్తిని మంచి పత్తిలో కలువవద్దన్నారు. యార్డుకు లూజ్ రూపంలో మాత్రమే తీసుకు రావాలన్నారు. అమ్మకానికి వచ్చే రైతులు బ్యాంకు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ పత్రాలను తీసుకురావాలని సూచించారు. తేమ 12శాతం మించి ఉంటే పత్తిని సీసీఐ వారు కొనుగోలు చేయరన్నారు.

అంతా అస్తవ్యస్తం..!

(5వ పేజీ తరువాయి)

చేసేదేమిలేక రైతులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పేరు నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే సర్వర్ పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కొత్త యాప్‌పై రైతులకు అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో రైతు సేవా కేంద్రాల వద్దకు, గుత్తి మార్కెట్ యార్డుకు రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువే

ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 44వేల హెక్టార్లుగా నిర్ణయించారు. అయితే జిల్లా వ్యాప్తంగా 30వేల హెక్టార్లల్లో మాత్రమే పత్తి పంట సాగైంది. గత మూడేళ్లతో పోలిస్తే ఈ సారి పత్తి పంట సాగు తగ్గింది. పెట్టుబడులు పెరగడం, మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ధర లేకపోవడమే సాగు తగ్గడానికి కారణమని రైతులు చెబుతున్నారు. ఈ సారి పంట సాగు విస్తీర్ణం తగ్గడంతోపాటు, పత్తి దిగుబడి అరకొరగానే వచ్చింది. అయినా ధర మాత్రం పెరగలేదు. కొందరు దళారులు కుమ్మక్కై ధరలు పెరగకుండా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల కిందట క్వింటా పత్తి రూ.10వేలు పలికింది. రెండేళ్ల కిందట క్వింటా నాణ్యతను బట్టి పత్తి రూ.7వేల నుంచి రూ.8వేలు దాకా ఉండింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పత్తినాణ్యతను బట్టి క్వింటాల్ ధర రూ.5500 నుంచి రూ.7000లు దాకా పలుకుతోంది.

మద్దత ధరతో కొనుగోలులో నిర్లక్ష్యం

ప్రభుత్వం పత్తి కనీస మద్దతు ధర రూ.8110లుగా నిర్ణయించింది. తేమ శాతం ఆధారంగా ధర చెల్లించేలా నిర్ణయించారు. 8 శాతం తేమ ఉంటే.. క్వింటాల్ పత్తి రూ.8110లుగా నిర్ణయించారు. 9 నుంచి 11 శాతం వరకు తేమ శాతం ఉంటే.. రూ.8028లు నుంచి రూ.7785లు దాకా ధర ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి ఏడాది గుత్తి, తాడిపత్రి మార్కెట్ యార్డుల్లో సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సారి కూడా గత నెల 22న స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా గుత్తి మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. అయితే రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయలేదు. ఈ నేపథ్యంలో రైతుసంఘాల నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 3న కొనుగోలు కేంద్రాన్ని తెరిచారు. తాడిపత్రి మార్కెట్ యార్డులో ఇప్పటి దాకా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదు.

పేరు నమోదు చేశా: రైతు నాగేంద్ర, ఊటకల్లు, గుత్తి మండలం



ఈ సారి ఆరు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. 35 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. బయట మార్కెట్‌లో ఫస్ట్ క్వాలిటీ పత్తి క్వింటాల్ రూ.7000లు, రెండో క్వాలిటీ రకం రూ.6400లకు అడుగుతున్నారు. ఇంకా బాగలేకపోతే పత్తివైపే చూడటం లేదు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.8110లు పెట్టింది. వారం రోజుల క్రితమే స్థానిక రైతు సేవా కేంద్రంలో పేరు నమోదు చేసుకున్నా. ఏ రోజు పత్తి తీసుకురావాలన్న సమాచారం ఎవరూ ఇవ్వలేదు. గతంలో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఏఏ తేదీల్లో కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుకురావాలో ముందుగా చెప్పేవారు. ఇప్పుడు సమాచారం ఇచ్చే నాథుడే లేడు.

ఇబ్బందిగా ఉంది: ఈశ్వర్‌రెడ్డి, తిమ్మాపురం, పెద్దవడుగూరు



పత్తి విక్రయించాలనుకొనే రైతులు కొత్త యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని షరతు పెట్టడంతో ఇబ్బందిగా ఉంది. సెల్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని, అందులో స్లాట్ బుక్ చేసుకోవాలని చెబుతున్నారు. అది ఎలా చేయాలన్నది మాకు తెలియదు. రైతు సేవా కేంద్రానికి వెళ్లిన సమయంలో సర్వర్ సరిగా పనిచేయడం లేదు. గత ఏడాది మా గ్రామంలోని చాలా మంది రైతులు గుత్తి మార్కెట్ యార్డులో పత్తి శాంపుల్స్ ఇచ్చినా.. పత్తిని కొనుగోలు చేయలేదు. ఈ సారైనా పత్తి కొనుగోలు చేస్తారో...? లేదో అర్థం కావడం లేదు. బయట మార్కెట్‌లో ధర తక్కువగా ఉంది. ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తుగా సమాచారం అందించి, పత్తి కొనుగోలు చేయాలి. .

వారానికి ఒకరోజు.. దారుణం



ఎన్నడూలేని విధంగా వారానికి ఒక రోజు మాత్రమే పత్తిని కొనుగోలు చేసేలా అధికారులు నిర్ణయించడం దారుణం. రైతులకు అవగాహన కల్పించకనే కొత్త యాప్‌లు తీసుకురావడం సరికాదు. స్లాట్ బుకింగ్‌తోపాటు ఏ తేదీన పత్తిని కేంద్రానికి తీసుకువెళ్లాలన్న సమాచారం కూడా యాప్‌లో చూసుకుంటేనే తెలుస్తోంది. మార్కెట్ యార్డు అధికారులకు కూడా ఈ సమాచారం ముందస్తుగా తెలియకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. సీసీఐ అధికారులు, మార్కెట్ యార్డు యంత్రాంగం మధ్య పూర్తి స్థాయిలో సమన్వయం లేదు. నాణ్యత లేదంటూ రైతులు తీసుకువెళ్లిన పత్తిని కొనుగోలు చేయకుండా వెనక్కి పంపిస్తున్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. గ్రామాల్లో టాంటాం ద్వారా రైతులకు స్లాట్ బుకింగ్ తేదీతోపాటు ఏఏ తేదీల్లో కేంద్రానికి పత్తిని తీసుకువెళ్లాలో సమాచారం ఇవ్వాలి. తాడిపత్రిలోనూ తక్షణమే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి. లేనిపక్షంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తాం.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

హైవేల జంక్షన్..!

(5వ పేజీ తరువాయి)

పొడవైనది 44వ జాతీయ రహదారి. ఈ రహదారి కోడూరు మీదుగా వెళ్లడంతో మొదటి నుంచి రవాణా సౌకర్యం ఎంతో మెరుగ్గా ఉంటోంది. దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లాలన్నా సునాయాసంగా వెళ్లేందుకు వీలుంది. రాష్ట్రానికి సరిహద్దుగా కోడూరు ప్రాంతం ఉండటంతో ఈ రహదారి ఈ ప్రాంత వాసులకు వరంగా మారిందనే చెప్పవచ్చు.



పెద్దన్నపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే

గ్రీన్ ఫీల్డ్ హైవే

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 44వ జాతీయ రహదారిలోని కోడూరు వద్ద ఈ ఆరు వరుసల ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి ప్రారంభమై బాపట్ల జిల్లాలోని అద్దంకి వద్ద ఎన్‌హెచ్ 16లో కలుస్తుంది. ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారి నిర్మాణం ఈ ప్రాంత అభివృద్ధికి నాంది అని చెప్పవచ్చు. రూ.14 వేల కోట్లతో 518 కిలోమీటర్ల పొడవుతో ఈ రహదారి నిర్మాణం జరుగుతోంది. సాధారణంగా బెంగళూరు నుంచి విజయవాడకు ప్రయాణ సమయం 10 నుంచి 12 గంటలు పట్టేది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే 5 నుంచి 6 గంటల్లోపే చేరుకోవచ్చు. దీంతో బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్లేవారు ఈ రహదారి గుండానే ప్రయాణం చేస్తారు.

342వ జాతీయ రహదారి

44వ జాతీయ రహదారిలోని కోడూరు వద్ద 342 జాతీయ రహదారి ప్రారంభమై ముదిగుబ్బ వద్ద ఎన్‌హెచ్ 42లో కలుస్తుంది. ఈ రహదారి బెంగళూరు నుంచి పుట్టపర్తికి రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుంది. కోడూరు నుంచి ముదిగుబ్బ వరకు 47 కిలోమీటర్లు పొడవు ఉంది. పుట్టపర్తి ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో దేశవిదేశీయులు బెంగళూరు నుంచి వెళ్లేందుకు ఈ జాతీయ రహదారి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. ఇప్పటికే ఈ జాతీయ రహదారి నాలుగు వరుసలుగా రూపుదిద్దుకుంటోంది. త్వరలో పనులు పూర్తి చేసుకుని, ప్రజలకు అందుబాటులోకి రానుంది.

544ఇ రహదారి

44వ జాతీయ రహదారిలోని కొడికొండ చెక్‌పోస్టు నుంచి నాలుగు వరుసల 544ఇ జాతీయ రహదారి ప్రారంభమై కర్ణాటకలోని శిర వద్ద ఎన్‌హెచ్ 48లో కలుస్తుంది. ఈ రహదారి 119 కిలోమీటర్ల పొడవు ఉంది. దీంతో ఉత్తర కర్ణాటకకు ప్రయాణించే వారికి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది.

అభివృద్ధికి చిహ్నం

దేశ అభివృద్ధిలో జాతీయ రహదారుల పాత్ర గొప్పదనే విషయం అందరికీ తెలిసిందే. నాలుగు జాతీయ రహదారులు ఒకే చోట నుంచి ప్రారంభమైతే ఇక వేరే చెప్పాల్సిన పనిలేదు. కోడూరు కేంద్రంగా నాలుగు జాతీయ రహదారులు ప్రారంభమై పలు ప్రాంతాలకు వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో కోడూరు ప్రాంతం భవిష్యత్తు అభివృద్ధికి చిహ్నంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. కోడూరు మీదుగా ఈ జాతీయ రహదారులు వెళ్లనుండడంతో రాష్ట్రస్థాయిలో కోడూరు పేరు అందరికీ పరిచయంగా మారనుంది. త్వరలో ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో కోడూరు ఐకాన్‌గా మారుతుందనడంలో సందేహం లేదు. ఇప్పటికే భూముల ధరలు పెరగడంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దాంతో ఈ ప్రాంతం ఆర్థికాభివృద్ధిలో అడుగులు వేస్తుందనడంలో అతిశయోక్తి లేదు.

డీజిల్ దందా

(5వ పేజీ తరువాయి)

అక్రమార్కుల యాపారం నిరాఘాటంగా సాగుతోంది.

రోజుకు 10వేల లీటర్లు

హిందూపురం, గోరంట్ల, పెనుకొండ రహదారిలో ఉన్న పరిశ్రమలకు కర్ణాటక నుంచి తెచ్చిన డీజిల్‌ను రోజూ 4వేల నుంచి 5వేల లీటర్లు ఇస్తున్నట్లు సమాచారం. గార్మెంట్స్, కియ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు చేసిన ప్రైవేట్ బస్సులకు మరో 2వేల లీటర్లదాకా రోజూ ఇస్తున్నట్లు తెలిసింది. అయితే పరిశ్రమలకు రాత్రి పొద్దుపోయాక తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. బస్సులకైతే పగటిపూటే అవి పార్క్‌చేసిన స్థలానికి వాహనాల్లో వెళ్లి నింపుతున్నట్లు సమాచారం.

రూ.లక్షలు పోగేసుకుంటున్న అక్రమార్కులు

ఆంధ్రలో లీటరు డీజిల్ రూ.100 ఉండగా కర్ణాటకలో రూ.92 నుంచి రూ.93కే దొరుకుతోంది. అంటే లీటరుపై రూ.7దాకా వ్యత్యాసం ఉంది. లీటరుపై రూపాయి ఖర్చులు పోయినా రూ.6 మిగులుతుంది. ఈలెక్కన డీజిల్ తరలించే వ్యక్తులు నెలకు దాదాపు రూ.20లక్షలకుపైగా వెనకేసుకుంటున్నారు. ఇదంతా ప్రభుత్వాదాయానికి గండి కొట్టి సంపాదిస్తున్నదే. నెలకు 3లక్షల లీటర్లు పైగానే కర్ణాటక నుంచి హిందూపురం ప్రాంతానికి డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. ఇందుకోసం మూడు టాటాఏస్ వాహనాలకు ప్రత్యేక ఏర్పాటు చేసుకున్నారు.

చోద్యంచూస్తున్న అధికారులు

కర్ణాటక నుంచి డీజల్‌ను తీసుకొచ్చి దర్జాగా ఇక్కడ విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కొన్ని సందర్భాల్లో లారీ ట్యాంకర్‌నే ఇక్కడున్న పెట్రోల్‌బంకు వద్దకు తెచ్చి అమ్మేస్తున్నారు. దీన్ని పన్నులు, పౌరసఫరాల శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ డీజిల్ దందాలో కొందరు చిన్న స్థాయి నాయకులు ఉండటం వల్లే అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిఘా ఉంచాం: కృష్ణవేణి, సీటీఓ, హిందూపురం



కర్ణాటక నుంచి ఆంధ్రకు అక్రమంగా డీజిల్ సరఫరా చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై నిఘా పెట్టాం. త్వరలోనే అక్కడి నుంచి డీజిల్ తీసుకొచ్చే వ్యక్తులు, వాహనాలను పట్టుకుంటాం. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తే ఉపేక్షించేది లేదు.

జేడీఏ చంద్రానాయక్‌కు తీవ్ర మందలింపు

అనంతపురం అర్బన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న సమయంలో ఏడీఏ పీపీ విద్యావతిపై అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించారన్న అభియోగాలపై అప్పటి జేడీఏ చంద్రానాయక్‌ను వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ తీవ్రంగా మందలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం కడప జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్నారు. గతంలో జేడీఏ కార్యాలయంలో పనిచేసిన ఏడీఏ పీపీ విద్యావతి జేడీఏ తనను ఇతర ఉద్యోగుల ఎదుట అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించి, అవమానించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనరేట్ ఉన్నతాధికారితో విచారణ చేయించారు. విచారణలో ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు వాస్తవమేనని నివేదికలు ఇచ్చినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు చేయనని చంద్రానాయక్ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా విన్నవించారు. ఈ నేపథ్యంలో చంద్రానాయక్‌ను తీవ్రంగా మందలించడంతో పాటు భవిష్యత్తులో తమ పరిధిలో పనిచేసే ఉద్యోగులపై దురుసుగా, అమర్యాదగా ప్రవర్తించకూడదని హెచ్చరించారు.

వీఆర్వో వెంకోబారావు సస్పెన్షన్



వీఆర్వో వెంకోబారావు

నార్పల, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): రైతును లంచం డిమాండ్ చేసిన మండలంలోని దుగుమర్రి వీఆర్వో వెంకోబారావును కలెక్టర్ ఆనంద్ సస్పెండ్ చేశారు. మూడు రోజులక్రితం రంగాపురం గ్రామానికి చెందిన రైతు నాగార్జున, కుళ్లాయప్ప భూమిని మ్యుటేషన్ చేయడానికి సెల్‌ఫోన్‌లో వీఆర్వో వెంకోబారావు రూ.38 వేలు లంచం డిమాండ్ చేశాడు. వీఆర్వో మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా వీఆర్వోను సస్పెండ్ చేశారు.

47 మందికి ఉద్యోగాలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 47 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. కళాశాల ప్రాంగణంలో డిల్సీ టీవీఎస్ టెక్నాలజీస్ కంపెనీ శుక్రవారం నియామకాలు చేపట్టింది. కళాశాల మెకానికల్, ఈఈఈ, ఈసీఈ బ్రాంచుల విద్యార్థులు పాల్గొనగా... 47 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగాలను ఎంపికైన విద్యార్థులను ఇండస్ట్రియల్, ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ ఆచార్య కిరణ్మయి, ప్రిన్సిపాల్ ఆచార్య చెన్నారెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణ నియామకాల అధికారి డా. శ్రీనివాసులు అభినందించారు.

రేపు స్కాలర్‌షిప్ టెస్టు

● విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం



స్కాలర్‌షిప్ టెస్టు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

పుట్టపర్తిరూరల్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 7న ఉచిత స్కాలర్‌షిప్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమచంద్ర శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జర్మనీ అనహిత స్ప్రింగ్ ఫౌండేషన్ సహకారంతో బీటెక్, బీబీఏ అడ్మిషన్ల కోసం నిర్వహించే స్కాలర్‌షిప్ టెస్టులో అర్హత సాధించిన విద్యార్థులకు హాస్టల్ సౌకర్యంతోపాటు ఉచిత విద్య అందిస్తామన్నారు. బీటెక్ అడ్మిషన్ల కోసం ప్రస్తుతం ఎంపీసీ స్ట్రీమ్‌ను అభ్యసిస్తున్న ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థినీవిద్యార్థులు, బీబీఏ ప్రవేశానికి ఇంటర్మీడియట్ అన్ని స్ట్రీమ్స్ వారు అర్హులన్నారు. వివరాలకు 9100974530 నంబరులో సంప్రదించాలన్నారు. విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేందుకు అనంతపురం, హిందూపురం, ధర్మవరం, మడకశిర, కదిరి పట్టణాల నుంచి ఉచిత రవాణాసదుపాయం కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

● భూసార పరీక్షాకేంద్రం ఏడీఏ రోజా పుష్పలత

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాలకు సంబంధించి భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించుకోవాలని అనంతపురం భూసార పరీక్షాకేంద్రం ఏడీఏ రోజా పుష్పలత సూచించారు. స్థానిక ప్రకృతి వ్యవసాయ విభాగ కార్యాలయంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ... భూసార పరీక్షల ఆధారంగా పొలాల్లో తగిన మేరకు ఎరువులు వాడాలన్నారు. తద్వారా ఎరువులకు అనవసరంగా పెట్టే ఖర్చులు తగ్గడంతోపాటు, పంటలు మంచి దిగుబడులు వస్తాయన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, భూసార పరీక్షాకేంద్రం ఏఓ కృష్ణకుమారి పాల్గొన్నారు.

గులాబీ గుబులు

● పత్తి పంటలో ఉధృతంగా గులాబీ రంగు పురుగు
● మందులు పిచికారీ చేసినా ప్రయోజనం శూన్యం
● ఆందోళనలో రైతులు



ఏపుగా పెరిగిన పత్తిపంట



గులాబీ రంగు పురుగు



పత్తికాయలను ఆశించిన పురుగు

పెద్దవడుగూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పత్తిపంటను గులాబీరంగు పురుగు గుల్ల చేస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో 15వేల హెక్టార్లలో పత్తి పంట సాగు చేశారు. పంట విత్తనం మొదలుకొని దిగుబడి చేతికి వచ్చే వరకు ఎకరాకు రూ.25వేల నుంచి 30వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. గతంలో ఎకరా సాగుచేస్తే 15నుంచి 20క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చేదని, గిట్టుబాటు ధర ఉండటంతో మంచి ఆదాయం లభించేదని రైతులు చెబుతున్నారు. పత్తి సాగుతో మంచి ఆదాయం ఉండటంతో గత కొన్నేళ్లుగా రైతులు ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. గులాబీరకం పురుగు పత్తి రైతుల ఆశలకు గండి కొడుతోంది. పిందె దశలో ఉన్న పత్తి కాయలకు గులాబీరంగు పురుగు ఆశించడం వల్ల కాయ మాడిపోతుంది. పంటను కాపాడుకోవడానికి వేల రూపాయలు వెచ్చించి రసాయన మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు ఏపుగా పెరిగి పత్తి కాయలు బాగా వచ్చినా గులాబీ రంగు పురుగు ఆశించడంతో కాయ పగలకుండా మాడిపోతోంది. అరకొరగా వచ్చే దిడుబడి సైతం నాణ్యతగా లేకపోవడంతో తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నష్టం వాటిల్లింది: నల్లపురెడ్డి, కండ్లగూడూరు గ్రామం



నేను మూడు ఎకరాల విస్తీర్ణంలో వర్షాధారంగా పత్తి సాగు చేశా. ఎకరాకు రూ.25వేల చొప్పున మూడెకరాలకు 75వేలు పెట్టుబడి పెట్టా. ఇప్పటికి కేవలం మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంటకు ఆశించిన గులాబీరంగు పురుగు నివారణకు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రయోజనం లేదు. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. తద్వారా రైతులకు నష్టం మిగులుతోంది.

అప్పులు మిగిల్చింది: రంగనాయకులు, పెద్దవడుగూరు



కౌలుకు తీసుకొని ఆరు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశా. ఎకరాకు రూ.50వేలు చొప్పున పెట్టుబడి పెట్టగా ఒక్క కేజీ కూడా దిగుబడి రాలేదు. ఈ ఏడాది కాకపోయినా మరో ఏడాది అయినా వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్న ఆశతో పంట సాగుచేస్తుంటే, ప్రతి ఏటా అప్పులే మిగులుతున్నాయి. ఏమాత్రం ఆర్థిక ప్రయోజనం ఉండటం లేదు.

మే, జూన్ మాత్రమే అనుకూలం



రైతులు పత్తి పంట సాగు చేయడానికి మే, జూన్ నెలలు మాత్రమే అనుకూలం. అదునుదాటిన తర్వాత పత్తి సాగు చేస్తే శీతల ప్రభావం వల్ల పూతదశలో గులాబీరంగు పురుగు ఆశిస్తుంది. ఎన్నిమార్లు రసాయనిక పురుగుమందులు పిచికారీ చేసినా, లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేసినా నివారించడం కష్టం. రైతులు ఒకేపంటను ఏళ్లతరబడి సాగుచేయకుండా ఇతర పంటలను సాగు చేయాలి. అప్పుడు ఖర్చు తగ్గి, ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. -మునికృష్ణ, వ్యవసాయాధికారి

అప్పుల ఉరికి నేతన్న బలి


కృష్ణమూర్తి (ఫైల్)

ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్‌కు చెందిన నీలూరి కృష్ణమూర్తి(60) అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.... కృష్ణమూర్తి సొంత మగ్గంపై పట్టు చీరలు నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈయనకు భార్య నాగలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. కుమారుడు బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కుమార్తెల వివాహాల కోసం కృష్ణమూర్తి దాదాపు రూ.10లక్షల దాకా అప్పులు చేశాడు. కాగా గత 8నెలల నుంచి కృష్ణమూర్తి నడుము నొప్పితో బాధపడుతుండేవాడు. దీంతో మగ్గం నేయడం చేతకాక, కుటుంబ అవసరాల కోసం మరింత అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలంటూ తరచూ కుటుంబసభ్యులతో మథనపడే వాడు. ఈక్రమంలోనే శుక్రవారం ఆయన భార్య స్నానం చేయడానికి వెళ్లగానే మగ్గానికే తాడుతో ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తరువాత భార్య వచ్చి చూడగా, విగతజీవిగా ఉరికి వేలాడుతున్న భర్త కనిపించాడు. టూటౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

దేవరకొండపై పునుగుపిల్లి కళేబరం


పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బుక్కరాయసముద్రం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): అరుదుగా కనిపించే పునుగుపిల్లి మండలకేంద్రం సమీపంలోని దేవరకొండపై అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కనిపించింది. ఎంతో విశిష్టమైన పునుగుపిల్లి ఆనవాళ్లు దేవరకొండపై ఉండటంతో భక్తులు ఇన్నాళ్లు ఆనందం వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు అది మృతి చెందిందన్న వార్త వారిని ఆవేదనకు గురిచేసింది. మృతి చెందిన పునుగు పిల్లి శరీరంపై అనేక చోట్ల కాట్లు, గాయాలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇది కుక్కల దాడిలో చనిపోయిందా? వేటగాళ్ల చేతిలో బలి అయ్యిందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మృతి చెందిన పునుగు పిల్లి కళేబరాన్ని అనంతపురం జిల్లా అటవీశాఖ అధికారులు పరిశీలించి, పోస్టు మార్టం నిర్వహణకు తరలించారు.

గంగదేవిపల్లిని సందర్శించిన ఏపీ వాసులు


గంగదేవిపల్లిలో సీడీసీ సభ్యులు

గీసుగొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సత్యసాయి, అనంతపురం జిల్లాలకు చెందిన అగలి, పుట్లూరు మండలాల నుంచి 40 మంది కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి గంగదేవిపల్లి నూతన గ్రామపంచాయతీ ఏర్పడిన తీరు, గ్రామాభివృద్ధిని, ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, సాధించిన అవార్డుల గురించి బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సభ్యుడు రామాంజనేయులు, రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఓబలేష్, కొట్టె రమాదేవి, ఆర్పీలు మేడిద సుశీల, గూడ సరోజన తదితరులు పాల్గొన్నారు.

అనంత, కడప దేవదాయ అధికారుల మార్పు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ రాష్ట్రంలోని ఇద్దరు జిల్లా శాఖ అధికారులను మార్చింది. కడప జిల్లా ఎండోమెంట్ అధికారి పి.మల్లికార్జున ప్రసాద్‌ను అనంతపురం జిల్లాకు అదే స్థానంలో బదిలీ చేసింది. అలాగే అల్లాడుపల్లి వీరభద్రస్వామి దేవస్థానం ఈవో సి.శంకర బాలాజీకి కడప జిల్లా దేవదాయశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్‌ను ఆదేశిస్తూ, ఆ శాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్థూల విలువపై రైతు సేవాకేంద్రాల సిబ్బందికి శిక్షణ

అమరావతి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో స్థూల విలువ, రైతులకు నికరాదాయం పెరిగేలా వ్యవసాయశాఖ కసరత్తు చేపట్టింది. ఈ నెల 3న నల్లజర్లలో 'రైతన్నా మీకోసం' వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబు ప్రకటించిన పంచ సూత్రాల అమలుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు. గేట్స్ ఫౌండేషన్ తోడ్పాటుతో ఆతెన ఇన్ఫోనోమిక్స్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ సాంకేతిక సహకారంతో స్థూల విలువ, నికరాదాయం అనే అంశంపై రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. దీనిపై శుక్రవారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ మనజీర్ జిలానీ ఇన్ఫోనోమిక్స్ ప్రాజెక్ట్ సిబ్బందితో సమావేశమయ్యారు. పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం, పంటకు విలువ జోడించడం, రైతుకు నికరాదాయం లభించేలా చర్యలు తీసుకోవడం, స్థూల విలువ లెక్కించడంపై రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

15 నుంచి ఆక్వా అథారిటీ సవరణ చట్టం అమలు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (సవరణ) చట్టం-2025 (యాక్ట్30 ఆఫ్ 2025)లోని అన్ని నిబంధనలు ఈనెల15 నుంచి అమల్లోకి వస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ నోటిఫికేషన్ జారీ చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) చట్టం-2020లో కూటమి ప్రభుత్వం కొన్ని సవరణలు చేసింది. ఆక్వా రైతుల రిజిస్ట్రేషన్, లైసెన్సుల జారీ, ఆక్వా సాగు పద్ధతులు, ఆక్వా యూనిట్లకు ఆడిట్ నిబంధనల్లో మార్పులు, మత్స్య శాస్త్రాన్ని పశువైద్య విశ్వవిద్యాలయ నియంత్రణ నుంచి మత్స్యవర్సిటీ నియంత్రణలోకి తెచ్చేలా అంశాల్లో సవరణలు చేసినట్టు సమాచారం.

టమోటా కిలో రూ.34



అనంతపురంరూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1275 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు.

రైతు కుటుంబానికి అండగా ఉంటాం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబ సభ్యులకు పరామర్శ


రైతు కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

అనంతపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన రైతు నాగలింగం కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి పేర్కొన్నారు. రైతు నాగలింగ ఆత్మహత్యకు పాల్పడ్డారన్న సమాచారంతో వారు శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు మరికొందరు టీడీపీ నాయకులతో కలిసి శుక్రవారం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వెళ్లారు. రైతు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. బాధిత రైతు కుటుంబ సభ్యులను కలిసి, ఆత్మహత్యకు కారణాలపై ఆరా తీశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, భరోసా ఇచ్చారు. పోస్టుమార్టం పూర్తయిన వెంటనే మృతదేహాన్ని ఎల్లుట్లకు తరలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రైతు నాగలింగం తోటి రైతుల అరటి పంటను కొనుగోలు చేసి, వ్యాపారం చేయడం వల్ల నష్టపోయి అప్పులపాలయ్యాడన్నారు. తనకున్న ఎకరాలోపు పొలంతోపాటు మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకొని, అరటి పంట సాగు చేసి, ధరలేక నష్టపోవడంతో అప్పులు అధికమయ్యాయని తెలిపారు. ఈక్రమంలో రైతు ఆత్మహత్యకు పాల్పడటం తమకెంతో బాధ కలిగిస్తోందన్నారు. రైతు ఆత్మహత్యను వైసీపీ నాయకులు రాజకీయాల కోసం వాడుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రైతు ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అన్నట్లుగా మాట్లాడటం సరైంది కాదన్నారు. స్వయంగా రైతు నాగలింగం తన వ్యాపార నష్టాలు, ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన కుటుంబ సభ్యులకు వాయిస్ మెసేజ్ పంపి, ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతుల గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదన్నారు.

రైతు కుటుంబానికి మంత్రి అచ్చెన్న భరోసా

రైతు నాగలింగ ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం ఓ ప్రత్యేక ప్రకటనలో పేర్కొన్నారు. బాధిత రైతు కుటుంబానికి మంత్రి సానుభూతి వ్యక్తం చేశారు. రైతు నాగలింగం అరటి సాగుతో పాటు వ్యాపారం చేయడం వల్ల నష్టపోయి, ఆత్మహత్యకు పాల్పడినట్లు తనకు సమాచారం ఉందన్నారు. వైసీపీ పాలనలో అరటి పంటకు సరైన ధరలు లేకపోవడం, ఎగుమతి చేసిన పంటకు చెల్లింపులు లేకపోవడం వల్లే ఆయన ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతిందన్నారు. బాధిత రైతు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన భరోసా నిచ్చారు. శవరాజకీయాలకు అలవాటుపడిన వైసీపీ నాయకులు రైతు ఆత్మహత్యను కూడా అలానే చేస్తున్నారన్నారు. వక్రీకరించి, ప్రభుత్వానికి ముడిపెట్టడం దారుణమన్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ మాజీ మంత్రి

అనంతపురం వైద్యం: అరటి రైతు నాగలింగం మృతదేహం పోస్టుమార్టంపై శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్ మధ్య చిన్నపాటి వాగ్వాదం నెలకొంది. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సర్వజన వైద్యశాలకు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆస్పత్రికి వచ్చిన మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్.. 'రాత్రే మరణించాడు, పాయిజనింగ్ కేసు, బ్యాక్టీరియా పట్టదు, స్మెల్‌రాదు, చూద్దామని వచ్చా. అప్పుడే పోస్టుమార్టానికి పంపించారేంట'ని అధికారులను ప్రశ్నించారు. బంధువుల అభ్యర్థన మేరకు డాక్టర్లు శుక్రవారం ఉదయమే పోస్టుమార్టం నిర్వహించారనీ, నాగలింగం కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు వచ్చే వరకు అండగా ఉంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఇంకా ఏమైనా సలహాలిచ్చినా తీసుకుంటామని మాజీ మంత్రి శైలజానాథ్‌కు తెలిపారు. 'పరవాలేదమ్మా.. ప్రజాప్రతినిధిగా మీ బాధ్యత అది' అంటూ శైలజానాథ్ బదులిచ్చారు. అనంతరం ఇరువురు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

అంత్యక్రియలు పూర్తి

పుట్లూరు: మండలంలోని ఎల్లుట్లలో టీడీపీ నాయకులు దగ్గరుండి ఆత్మహత్యకు పాల్పడిన రైతు నాగలింగం అంత్యక్రియలను శుక్రవారం పూర్తి చేయించారు. సుమారు రూ.30వేలను కుటుంబ సభ్యులకు అందించారు. ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ రూ.20 వేలు, శింగనమల మార్కెట్‌యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు ఆర్థికసాయం అందజేశారు.

దురదృష్టకరం: వైసీపీ నాయకులు

అరటిరైతు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జ్ శైలజానాథ్ పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి రూ.25లక్షల పరిహారాన్ని ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కంబదూరం

పని చేయడానికి జంకుతున్న సెక్రటరీలు

పంచాయతీల్లో అక్రమాల నేపథ్యంలోనే వెనుకంజ

కంబదూరు మండలం నుంచి డెప్యుటేషన్‌పై వెళ్లే యత్నం

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) జిల్లాలోని కంబదూరు మండలంలో పని చేయడానికి కార్యదర్శులు జంకుతున్నారు. ప్రధానంగా ఆ మండలంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శి అశ్వత్థరెడ్డి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటంతో అక్కడికి బదిలీపై వెళ్లిన సిబ్బంది పని చేయడానికి జంకుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. సిబ్బంది కొరత కారణంగా మండలంలోని రాళ్ల అనంతపురం పంచాయతీ కార్యదర్శిగా ఉన్న అశ్వర్థరెడ్డికి కురాకులపల్లి, చెన్నంపల్లి, కర్తనపర్తి పంచాయతీలు కూడా గతంలో ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే గ్రేడ్-4 కార్యదర్శి అయిన అశ్వత్థరెడ్డికి గ్రేడ్-3 కార్యదర్శిగా ప్రమోషన్ ఇచ్చి, కంబదూరు పంచాయతీకి నియమించారు. ఇదే క్రమంలో ఆయన ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న పంచాయతీలకు సైతం రెగ్యులర్ కార్యదర్శులను నియమించారు. కురాకులపల్లి పంచాయతీకి శ్రీరాములు, చెన్నపల్లి పంచాయతీకి అశోక్, రాళ్ల అనంతపురం పంచాయతీకి మహేంద్రరెడ్డి, కర్తనపర్తి పంచాయతీకి రామ్మోహన్‌ను నియమించారు. వారంతా అక్టోబరు 28న బాధ్యతలు చేపట్టారు. అయితే వారికి బాధ్యతలు అప్పగించకుండా నవంబరు 27 వరకు ముప్పతిప్పలు పెట్టాడన్న ఆరోపణలు అశ్వత్థరెడ్డిపై ఉన్నాయి.



డిప్యూటీ ఎంపీడీఓకు తలనొప్పి..

సీనియర్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ ఎంపీడీఓగా ప్రమోషన్‌పై వెళ్లిన లీలాబాయికి సైతం ఆ మండలంలో ఈయన తలనొప్పిగా మారారన్న ప్రచారం ఉంది. 'మండలంలోని అందరితోను పనులు చేయించగలుగుతున్నాం. కానీ అశ్వత్థరెడ్డితో చేయించలేకపోతున్నాం. అందుబాటులో ఉండడు. చెప్పినమాట వినడు' అని డీపీఓ నాగరాజనాయుడు తనిఖీకి వెళ్లినప్పుడు డిప్యూటీ ఎంపీడీఓ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీన్ని తేలిగ్గా తీసుకున్న డీపీఓ తదనంతర కాలంలో కార్యదర్శి అశ్వత్థరెడ్డి వల్లే కమిషనర్‌తో చీవాట్లు తినాల్సి వచ్చింది. ఎట్టకేలకు డీపీఓ తీసుకోవాల్సిన క్రమశిక్షణ చర్యలు ఏకంగా కమిషనరే తీసుకొని అశ్వత్థరెడ్డిని గత నెల 27 సస్పెండ్ చేశారు. దీంతో స్థానికంగా బాధ్యతలు చేపట్టిన నూతన కార్యదర్శులు తమ పంచాయతీలో ఏమి జరిగిందన్నది ఒక్కొక్కటిగా పరిశీలించుకుంటూ వచ్చారు. దీంతో అశ్వత్థరెడ్డి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో అక్కడ ఉన్న ఉన్నతాధికారులకు ఎంపీడీఓ సహా ఎవరి వాటాలు వారికి అందడంతో బయటకు పొక్కకుండా జాగ్రత్తలు చేపట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో కంప్యూటర్ ఆపరేటర్ కీలకంగా వ్యవహరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కంప్యూటర్ ఆపరేటర్‌కు సంబంధించి నీ పాత్ర ఉన్నట్లు ఏమాత్రం తెలిసిన ఇక్కడ ఉండలేవని డిప్యూటీ ఎంపీడీఓ హెచ్చరించినట్లు సమాచారం.

అక్రమాలు తేల్చే పనిలో...

కాగా అశ్వత్థరెడ్డి స్థానంలో నూతనంగా పంచాయతీల వారిగా బాధ్యతలు చేపట్టిన వారు గతంలో జరిగిన అక్రమాలు నిగ్గుతేల్చడంలో నిమగ్నం అయ్యారు. అయితే వారిపై వస్తున్న ఒత్తిళ్ల కారణంగా మాకొచ్చిన సమస్య ఎందుకు ఇక్కడ ఉండకుండా మరోప్రాంతానికి డెప్యుటేషన్‌పై వెళ్లిపోతే సరి అని భావించి, ఆ ప్రయత్నాల్లో ఉన్నట్లు చర్చ జరుగుతోంది. అందులో భాగంగానే నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శుల్లో ఇద్దరు శుక్రవారం డీపీఓ నాగరాజునాయుడును కలిసి తమ గోడు చేప్పుకోవడానికి డీపీఓ కార్యాలయానికి వచ్చారు. డీపీఓ బిజీగా ఉండటంతో సంప్రదించకుండానే వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

హత్యకేసు ఛేదింపు

వివాహేతర బంధం నేపథ్యంలోనే దారుణం

నలుగురు నిందితుల అరెస్టు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం మండలం మారాల రిజర్వాయర్‌లో ఆగస్టు 8న లభించిన గుర్తుతెలియని మృతదేహం కేసును ఛేదించినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ విజయ్‌కుమార్, పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్‌తో కలిసి కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. నల్లమాడ మండలం వంకరకుంట గ్రామానికి చెందిన రామనోల్ల గంగాభవానికి అదే ఊరికి చెందిన వడ్డే గంగాద్రితో వివాహేతర సంబంధం ఉండేది. విషయం తెలుసుకున్న ఆమె భర్త రామనోల్ల రామప్ప ప్రతిరోజు మద్యంసేవించి ఆమెను కొట్టేవాడు. ఇది భరించలేని గంగాభవాని తన భర్త అడ్డు తొలగించుకోవాలనుకుంది. ప్రియుడైన గంగాద్రితో తన భర్తను చంపాలని, అవసరమైన డబ్బు ఇస్తానని చెప్పింది. దీంతో గంగాద్రి వంకరకుంట గ్రామానికే చెందిన విష్ణుతో కలిసి రామప్పను చంపాలని సుపారీ కుదుర్చుకున్నారు. ఈక్రమంలోనే జూలై 23న రామప్పను చంపడానికి ప్రయత్నించి, విఫలమయ్యారు. దీంతో హత్యా పథకంలోకి మరో వ్యక్తి సుదర్శన్‌ను చేర్చుకున్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

పథకం ప్రకారం జూలై 27న ఇంటిలో నిద్రిస్తున్న రామప్ప తలపై ఇటుకలతో కొట్టి, ఊపిరి ఆడకుండా చేసి చంపేశారు. తర్వాత శవాన్ని సంచిలో పెట్టి మారాల రిజర్వాయర్‌లో పడేశారు. ఆగస్టు 8న మారాల రిజర్వాయర్‌లో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసిన వీఆర్‌ఏ పుల్లప్ప బుక్కపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించారు. దీంతో వివరాలు వెలుగు చూశాయి. నిందితులను నల్లమాడ మండలం రెడ్డిపల్లి శివారులో అరెస్టు చేశారు. ఎలాంటి క్లూ లేకపోయినా నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐలను వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

పంట మార్పిడితోనే అధిక దిగుబడులు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

గార్లదిన్నె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ పేర్కొన్నారు. ప్రపంచ నేల దినోత్సవాన్ని పురస్కరించుకొని కనుంపల్లిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మట్టినమూనా పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని, దాని ఆధారంగానే పంటలకు మందులు, ఎరువులు వేయాలిన సూచించారు. ఒకే పంటను సాగుచేయడం ద్వారా నేలలో సారం తగ్గి దిగుబడులు తగ్గుతాయని, సేంద్రీయ వ్యవసాయపై దృష్టిసారించాలని అన్నారు. అనంతరం రైతులకు మొక్కలు అందచేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లీశ్వరీ, శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, సే ట్రీస్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ నారాయణస్వామి, వ్యవసాయ అధికారి సోమశేఖర్, సే ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఏఈఓ హరి, వీఏఏ నరేష్, రైతులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ఎన్నికలు వాయిదా

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాథమిక గొర్రెల సహకార సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఉమ్మడి జిల్లాలోని 55 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు శుక్రవారం ఎన్నికలు జరగాల్సి ఉంది. రొద్దం మండలం తురకలాపట్నం, శింగనమల మండలం సలకం చెరువు, కంబదూరు మండలం చెన్నంపల్లి, కుందుర్పి మండలం బెస్తరపల్లి, కనగానపల్లి మండలం దాదలూరు ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు జరగలేదు. పాత సంఘం నాయకులు తగిన రికార్డులు సమర్పించకపోవడం, ఇతర కారణాలతో ఈ ఎన్నికలు వాయిదా పడినట్లు సమాచారం. వీటితోపాటు మరికొన్ని సంఘాల ఎన్నికలు వాయిదాపడినట్లు తెలిసింది. పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయానికి ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన వెటర్నరీ డాక్టర్లు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన తగిన సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించారు. ఎన్ని సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయన్న పూర్తి సమాచారం ఇంకా తెలియడంలేదు. శనివారం పూర్తి స్థాయిలో సమాచారం అందే అవకాశం ఉందని జేడీ కార్యాలయవర్గాలు పేర్కొన్నాయి.

డిగ్రీలో నలుగురు డిబార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ 3, 5 పరీక్షల్లో నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ శుక్రవారం తెలిపారు. అనంతపురంలోని ఎస్ఎల్ఎన్ కళాశాలలో ఒకరు, హిందూపురంలోని బాలాజీ విద్యామందిర్‌లో ముగ్గురు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా, గుర్తించి డిబార్ చేశామన్నారు.

రేపు క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి జూడో క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం ఆర్డీటీ స్టేడియంలోని నిర్వహిస్తున్నట్లు జిల్లా జూడో అసోసియేషన్ కార్యదర్శి గోవిందు తెలిపారు. జూడో జూనియర్స్, క్యాడెట్ బాల, బాలికల క్యాటగిరిలలో ఈ ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19 నుంచి కర్నూలులో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని, వివరాలకు 99891 95158ను సంప్రదించాలని కోరారు.

ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్

రామగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రామగిరి ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైనట్టు ఎన్నికల అధికారి సంజీవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని, అనంతరం ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యులు అందరూ తప్పక హాజరు కావాలన్నారు. ఎంపీపీ నాగమ్మ గత డిసెంబరు 30 మరణించడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. కాగా ఇప్పటికే నాలుగు సార్లు ఈ ఎన్నిక వాయిదా పడింది. ఇది ఐదోసారి. ఈ ఎన్నికకు హాజరు కావాలని సభ్యులకు నోటీసులు అందజేయడానికి వెళ్లగా కొందరు అందుబాటులో లేరు. గడిచిన నాలుగు సార్లుకూడా సభ్యులు ఎన్నికకు రాకుండా క్యాంపు రాజకీయాలకే పరిమితమయ్యారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక


అనిల్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తలారి అనిల్ ఎంపికయ్యాడు. ఇతను కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ రామాంజినేయులు, లక్ష్మీదేవి కుమారుడు. ఫిబ్రవరిలో ఇండోనేషియాలో జరిగే అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారత్ తరఫున పాల్గొంటున్నాడు. అనిల్‌ను బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి రాజారాం, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విజయశంకర్ రెడ్డి, బాలాజీ, ఉపాధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, వెంకటేశులు అభినందనలు తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూలు విడుదల

అమరావతి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూలును ఓపెన్ స్కూల్ సొసైటీ శుక్రవారం ప్రకటించింది. మార్చి 16 నుంచి 28 వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు టెన్త్ పరీక్షలు జరుగుతాయని తెలిపింది. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 2 నుంచి 13 వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని వివరించింది. ఇంటర్ ప్రాక్టికల్స్ ఏప్రిల్ 11 నుంచి 18 వరకు జరుగుతాయని పేర్కొంది.

కార్మికుల కడుపు కొడితే సహించం

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్


ఉపకమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న నాయకులు

అనంతపురం టౌన్, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులను విధులనుంచి తొలగించి, వారి పొట్ట కొట్టాలని చూస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను రద్దు చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ అనుబంధ ఏపీ మెడికల్, హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో కలిసి శుక్రవారం జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికులు ప్రజాసేవే జీవితంగా చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలకు తెగించి సేవ చేసిన ఇదే కార్మికులను నేడు వయస్సు పేరుతో తొలగించడం అన్యాయమన్నారు. డిగ్రీ ఉన్నా.. లేకున్నా 22 మంది సూపర్‌వైజర్లను తొలగించడం వారి కుటుంబాలను రోడ్డున పడేసే చర్య అన్నారు. పద్మావతి ఏజెన్సీ నిర్వాహకుడు భాస్కర్‌నాయుడు తీసుకుంటున్న అక్రమ నిర్ణయాలపై ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ.. పారిశుధ్య కార్మికుల పాదాలు కడిగి గౌరవించారనీ, నేడు వారిపై తిరుగుబాటు చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కార్మికశాఖ ఉపకమిషనర్ లక్ష్మీనరసయ్యను కలిసి వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. దీనికి ఆయన స్పందిస్తూ సమస్య కేవలం జిల్లా పరిధిలో మాత్రమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఉందని తెలిపారు. ఈ అంశాన్ని రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్, హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు ఏజీ రాజమోహన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్వి నాయుడు, నగర కార్యదర్శి ముత్తుజ, కార్మిక ప్రతినిధులు నల్లమ్మ, దేవా నరేష్, పద్మావతి హౌస్ కీపింగ్ ఏజెన్సీ ప్రతినిధులు సాయితేజ, హరిప్రసాద్, జమ్మునాథ్, అతావుల్లా తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్



అయ్యప్ప స్వామిని ఊరేగిస్తున్న మాలధారులు

ఘనంగా అయ్యప్ప గ్రామోత్సవం

ముదిగుబ్బ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దొరిగల్లు రోడ్డులో అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తుల కోలాటాలు, భజనలు, అయ్యప్ప కీర్తనలతో స్వామి దేవస్థానం వద్ద నుంచి ముదిగుబ్బ వీధులలో అయ్యప్ప స్వామి ఉత్సవవిగ్రహాన్ని ఊరేగించారు. తెల్లవారు జామునే ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామోత్సవంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో కోలాటం ఆడుతున్న భక్తులు

'మాదక ద్రవ్యరహిత సమాజాన్నినిర్మిద్దాం'

కొత్తచెరువు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచిని, చెడును తెలుసుకుని గంజాయి, డ్రగ్స్ మహమ్మారి బారినపడకుండా జాగ్రత్తగా ఉండాలని ఈగల్ ఆర్ఎస్ఐ శ్రీహరి తెలిపారు. మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నతపాఠశాలలో శుక్రవారం మెగా పీటీఎం నిర్వహించారు. ఇందులో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించినట్లు ఈగల్ ఆర్ఎస్ఐ శ్రీహరితెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు రవాణా, అమ్మకం, వినియోగం చేస్తుంటే టోల్‌ఫ్రీ నంబరు 1972కు తెలియజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

నల్లమాడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సి. బండవండ్లపల్లి కి చెందిన బడా సోమశేఖర్‌రెడ్డి కనిపించడం లేదని ఆయన తండ్రి సుబ్బిరెడ్డి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. నెల 15న సోమశేఖర్‌రెడ్డి కడపజిల్లా గండి పుణ్య క్షేత్రానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడని, తిరిగి ఇంతవరకు తిరిగిరాలేదని తండ్రి ఫిర్యాదు చేశారని తెలిపారు. సోమశేఖర్‌రెడ్డి మతిస్థిమితం లేకుండా తిరిగేవాడని... బంధువులు, స్నేహితుల గ్రామాల్లో వెతికినా ఆచూకీ కనిపించలేదని తండ్రి సుబ్బిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బడా సోమశేఖర్‌రెడ్డి

వాజ్‌పేయి విగ్రహ ఏర్పాట్ల పరిశీలన

ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రిసత్యకుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయిని స్మరించుకుంటూ ధర్మవరంలో ఏర్పాటుచేయనున్న విగ్రహ ఏర్పాట్లను బీజేపీ నాయకులు పరిశీలించారు. శుక్రవారం స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో వాజ్‌పేయ్ విగ్రహ ఏర్పాటు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిసె దేవానంద్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పాల్గొన్నారు. ఈనెల 11న ధర్మవరంలోని కాలేజ్ సర్కిల్‌లో వాజ్‌పేయి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరిస్తామని తెలిపారు.

గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

గాండ్లపెంట, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డివెలగల సచివాలయంలో గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడి ఎన్నికను శుక్రవారం నిర్వహించారు. ఈఎన్నికను తన కల్లు పశు వైద్యాధికారి రవినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రెసిడెంట్‌గా నాగరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా తాజుద్దీన్, కమిటీ సభ్యులు శ్రీరాములు, సుబ్బరాయుడు, గంగప్ప, రాంప్రసాద్, పిఆర్. ఉమేషా ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిని ఘనంగా పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జీ ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ కంబయ్య, పలువురు గ్రామస్థులున్నారు.

'మెనూ పాటించకపోతే ఎలా?'

తనకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సీజీ ప్రాజెక్టు వద్దనున్న గిరిజన గురుకుల పాఠశాలలో శుక్రవారం మెగా పీటీఉం నిర్వహించారు. ప్రభుత్వం రూ.కోట్లు నిధులు విద్యార్థినుల విద్యకోసం ఖర్చు చేస్తున్నా, ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ఎందుకు పాటించడంలేదని మండిపడ్డారు. పదిరోజులుగా కోడి గ్రుడ్లు, మాంసాహారం ఇవ్వకపోడం ఏమిటని విద్యార్థినుల తల్లిదండ్రులు, టీడీపీ, గిరిజన సంఘాల నాయకులు ప్రిన్సిపాల్ మార్గరెట్‌పై ఆగ్రహించారు. ఓదశలో మీకు ఇష్టం లేకుండా ఇక్కడ నుంచి వెళ్లిపోవచ్చని పేర్కొన్నారు. స్థానిక గిరిజన నాయకులను, ప్రజాప్రతినిధులను కనీసం గుర్తించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈవిషయాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు కృష్ణమూర్తి అప్పుల బాధతో శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు సంధారాఘవ.. మృతుడి ఇంటి వద్దకు వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. ఆర్థికసాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో టీడీపీ నాయకులు సంధా రవీంద్ర, జింకా పురుషోత్తం, కేశగాళ్ల శ్రీనివాసులు, కొత్తపేట ఆది, నర్సి, హరి, సాయి, సూరి పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న 8 మంది అరెస్ట్

బత్తలపల్లి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని డి చెర్లోపల్లి సమీపంలో గురువారం రాత్రి పేకాట స్థావరం పై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న ఎమినిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. డి చెర్లోపల్లి సమీపంలోని గుట్టలో గురువారం అర్ధ రాత్రి పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎనిమిది మందిని అరెస్టు చేశామని, వారి వద్ద నుంచి రూ.41,350 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ఎనిమిది మంది పరారయ్యారని తెలిపారు. మొత్తం 16 మందిపై కేస్ నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



మెగా పీటీఎంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్



బుక్కపట్నం కేజీబీవీలో మాట్లాడుతున్న ఆర్డీఓ సువర్ణ



ధర్మవరం బీఎస్ఆర్ పాఠశాలలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

పండుగలా మెగా పీటీఎం

అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో శుక్రవారం మెగా పీటీఎంను అధికారులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. దీంతో పండుగ వాతావరణం తలపించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య : జేసీ

ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన విద్యను అందిస్తున్నాయని, ఉపాధ్యాయులు సమన్వయంతో బాధ్యతగా విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పేర్కొన్నారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా పీటీఎం సమావేశానికి జేసీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆర్డీఓ మహేశ్, ఎంఈఓ-1 రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం విద్యార్థుల ఎదుగుదలకు ఒక వేదికగా తయారైందన్నారు. క్రమశిక్షణతో కూడిన చదువు విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. అనంతరం బాల్య వివాహం చేసుకోరాదని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం రాం ప్రసాద్, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలు, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు.

● ధర్మవరం రూరల్: మండలంలోని మోటుమర్ల కేజీబీవీ లో నిర్వహించిన మెగా పీటీఎంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు, వసంతపురం మండలపరిషత్ పాఠశాలలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి హాజరయ్యారు. కార్యక్రమాల్లో ఎంఈఓ గోపాల్ నాయక్, కేజీబీవీ పాఠశాల ఎస్ఓ చంద్రకళ, పంచాయతీ సెక్రటరీ మురళీ, టీడీపీ నాయకులు విజయసారథి, బీజేపీ మండల అధ్యక్షుడు గొట్లూరు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

● బుక్కపట్నంలోని కేజీబీవీలో నిర్వహించిన మెగా పీటీఎంలో ఆర్డీఓ సువర్ణ పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని పేర్కొన్నా రు. తహసీల్దార్ నరసింహులు, ఎంఈఓ గోపాల్ నాయక్, ఎస్ఓ సౌజన్య, విద్యా కమిటీ చైర్మన్లు ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామస్థులు పాఠశాల అభివృద్ధి కోసం రూ.50వేలను అందజేసినట్లు ప్రధానోపాధ్యా యుడు బి.శేఖర్ తెలిపారు. విరాళం అందజేసిన వారికి ప్రధానోపాధ్యా యుడు, ఉపాధ్యాయుల బృందం ధన్యవాదాలు తెలియజేశారు.

● బత్తలపల్లి: మండలంలోని అప్రాచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చంద్రమౌళీశ్వర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో



అగ్రహారంలో హెచ్ఎంకు రూ.50 వేల విరాళం అందజేస్తున్న గ్రామస్థులు

బీజేపీ నాయకులు వీరనారప్ప, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: మెగా పీటీఎంను మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, విద్యా వ్యవస్థలో తీసుకున్న నిర్ణయాలను విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు కొనియాడారు. మండల అధికారులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● తాడిమర్రి: మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మెగా పీటీఎంను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రంగారవు, ఎంఈఓ క్రిష్ణమోహన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● కొత్తచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో పండుగ వాతావరణం తలపించింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎంలు రామకృష్ణయ్య, వెంగన్న, ఏఓ సతీశ్‌బాబు, పాఠశాలహెచ్ఎం గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● గాండ్లపెంట: మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు... విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఎంఈఓ కృష్ణనాయక్, శ్రీనివాసులు, తహసీల్దార్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

● నల్లమాడ: స్థానిక కేజీబీవీలో ఎస్ఓ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ మనోజ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు హాజరయ్యారు. సర్పంచ్ రమావత్ భారతి, టీడీపీనాయకులు మైలే శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు: మండలంలోని కొండకమర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పీటీఎంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి కొండబోయిన సతీష్‌ను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన పాఠశాలకు డయాస్ కట్టించినందుకు పూలమాలలు, దుశ్శాలువతో సత్కరించారు. అలాగే తంగేడుకుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలో తంగేడుకుంట గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కేఎల్ నంజుండప్పను ఘనంగా సన్మానించారు. ఆయన విద్యార్థులకు క్రీడాసామగ్రి, దుస్తులను తనవంతుగా పంపిణీ చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పిల్లలకు చదువే నిజమైన ఆస్తి

● ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

పుట్టపర్తి రూరల్/ అమడగూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేటి పిల్లలే రేపటి పౌరులని, పిల్లలకు చదువే నిజమైన ఆస్తి అని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. మునిసిపల్ పరిధిలోని బీడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, అమడగూరు మండలకేంద్రంలోని మోడల్ స్కూల్, జడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో శుక్రవారం ఏర్పాటుచేసిన మెగా పీటీఎం కార్యక్రమాలకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఆయా పాఠశాలల్లో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి చేతులమీదుగా ప్రశంసాపత్రాల ను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో బీడుపల్లి స్కూల్‌కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వైస్‌చైర్మన్ రాధ, ప్రధానోపాధ్యాయిుడు గోపాల్‌నాయక్, తహసీల్దార్ రామనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ మునెప్ప, ఈఓఆర్డీ రాజశేఖర్, ఎంఈఓలు జిలాన్‌బాషా, సంపూర్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, గోపాల్‌నాయక్, కేజీబీవీ ఎస్ఓ వెంకటరమణమ్మ, టీడీపీ మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కాలేనాయక్, సర్పంచ్ షబ్బీర్, జీసీడీఓ అనిత తదతరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

● ఎమ్మెల్యే కందికుంట

కదిరి/నల్లచెరువు/తనకల్లు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. ఆయన శుక్రవారం కదిరి పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల, నల్లచెరువు మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, తనకల్లు మండలపరిధిలోని సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కదిరి కళాశాలలో విద్యార్థినులకు భోజనం వడ్డించారు. నల్లచెరువు ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థుల కోసం ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటుచేసిన ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో కదిరి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ ప్రసాద్, ఆర్డీవో వీవీఎస్ శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఫర్వీనాబాను, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, మండలాల అధికారులు టీడీపీ నాయకులు ఎద్దుల క్రిష్ణమూర్తి, తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, తోట సరోజమ్మ, ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌నాయుడు, రాజారెడ్డి, ఆనంద్‌రెడ్డి, సోంపాలెం నాగభూషణం, బాగేపల్లి చలపతి పాల్గొన్నారు.

పిల్లల ఉన్నతికి తపించేది ఉపాధ్యాయులే

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

ధర్మవరం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): అనునిత్యం తల్లిదండ్రుల కంటే ఎక్కువగా పిల్లల ఉన్నతిని కోరుకునేది ఉపాధ్యాయులు మాత్రమే నని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణం లోని బీఎస్ఆర్ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమానికి పరిటాలశ్రీరామ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పిల్లలు తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా పిల్లలు ముందుకెళ్లాల న్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. ఇటీవల ఫ్లోర్‌బాల్ క్రీడలో రాణించి, సింగపూర్‌లో జరిగే పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, చిం తలపల్లి మహేశ్, ఫణికుమార్, పరిశే సుధాకర్, సంధా రాఘవ, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, చింతపులుసు పెద్దన్న, జింకా పురుషోత్తం, అంబటి సనత్, కొత్తపేట ఆది, మాధవ రెడ్డి, చట్టా లక్ష్మీనారాయణ, కరెంటు ఆది, జింకల రాజన్న, భాస్కర్ చౌదరి, గవ్వల నారాయణ స్వామి, రాంపురం శీన, గంగారపు రవి, పల్లపు రవీంద్ర, గిరక నాగేంద్ర, రావుల చెరువు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీఓల తాలుకా కమిటీ ఎంపిక



సాయి ఆరామంలో ప్రతిజ్ఞ చేస్తున్న కమిటీ సభ్యులు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ సత్యసాయి తాలుకా కమిటీ ఎకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అదబికారి ఈశ్వరయ్య, సహాయ ఎన్నికల అధికారి శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సాయిఆరామంలో జరిగిన ఏపీఎన్జీఓ తాలూకా నూతన కార్యవర్గ ఎన్నికలనుజిల్లా ఏపీఎన్జీఓ ఆడహాక్ కమిటీ మెంబర్, ఎన్నికల అధికారి ఈశ్వరయ్య, సహాయ ఎన్నికల అధికారి శంకర్, పర్యవేక్షకులు శంకరనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించి, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీ.దేవేంద్ర, అసోసియేట్ అధ్యక్షుడిగా మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా శంకర్‌రావు, ప్రభాకర్, సురేష్‌బాబు, ఆనంద్‌నాయక్, కవితమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎల్ సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా విజయ్‌కుమార్, జాయంట్ కార్యదర్శులుగా శివయ్య, సురేష్, జ్ఞానేంద్ర, అరుణ, అన్నపూర్ణమ్మ, కోశాధికారిగా మల్లికార్జునరెడ్డినిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఏపీఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, జిల్లా అధ్యక్షుడు లింగారామ్మోహన్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్ అభినందించారు.

నేడు ఆర్వోబీ ప్రారంభం

కదిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కదిరి-మదనపల్లి రహదారిలో కౌలేపల్లి వద్ద నిర్మించిన ఆర్వోబీని (రోడ్డు ఓవర్ బ్రిడ్జి)ని శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కదిరి- మదనపల్లి మధ్యలో కౌలేపల్లి వద్ద రైల్వేగేట్ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం బ్రిడ్జి పూర్తి కావడంతో శనివారం నుంచి ఆ అవస్థలు తప్పనున్నాయి. కదిరి నుంచి అన్నమయ్య జిల్లా వరకు నియోజకవర్గంలో ఎక్కడా రైల్వే గేట్లతో ఇబ్బంది పడకుండా బ్రిడ్జిలు నిర్మించారు. కౌలేపల్లి, రాట్నాపల్లి వద్ద బ్రిడ్జిలు నిర్మించారు. ఇప్పటికే రాట్నాపల్లి వద్ద ఉన్న బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభమయ్యాయి. కౌలేపల్లి వద్ద ఉన్న బ్రిడ్జి ప్రారంభం అవుతుండడంతో వాహనదారులకు రైల్వేగేట్ల వద్ద ఇబ్బంది లేకుండా మనదపల్లి వరకు సాఫీగా ప్రయాణం సాగే అవకాశముందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ప్రజాదర్బార్

కదిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలపరిధిలోని కుర్లి గ్రామంలో శనివా రం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10నుంచి ప్రజాదర్బార్ ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఆధార్‌కార్డును జతచేసి ఎమ్మెల్యేకి అందజేయాలని కోరారు.

ప్రతి అర్జీ పరిష్కరించాలి

● ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

అమడగూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారం కోసం బాధ్యాతయుతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలన్నారు. మండలవ్యాప్తంగా గ్రామాల్లో ఎక్కువగా రెవెన్యూ సమస్యలున్నాయని, న్యాయబద్ధంగా పరిష్కరించాలని తెలిపారు. నల్లమాడ, ఓడీసీ మండలాలనుంచి ప్రజలు తరలి వచ్చి తమ సమస్యలను విన్నవించారు. అనంతరం ఆయా మండలాలకు చెందిన ఎనిమిది మందికి మంజూరైన రూ.3.22లక్షల చెక్కులను లబ్ధిదా రులకు అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్లు గోపాల్‌రెడ్డి, జయచంద్ర, మైలే శివశంకర్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర డైరెక్టర్ కాలేనా యక్, సర్పంచ్ షబ్బీర్, తహసీల్దార్లు రామనాథ్‌రెడ్డి, శ్రీనివాస్, ఎంపీడీ ఓలు మునియప్ప, శ్రీనివాసులు, శివప్రసాద్‌రెడ్డి, కూటమి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాజారెడ్డి, నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం: పరిటాల శ్రీరామ్

ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పార్టీ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ ఎర్రగుంట కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. వార్డులలో అత్యధికంగా మురుగు కాలు వలపై స్లాబ్‌లు టీడీపీ నాయకులు ఆయనకు తెలిపారు. స్పందించిన పరిటాల శ్రీరామ్ మున్సిపల్ డీఈ వీరేశ్ మాట్లాడి పాడైపోయిన స్లాబ్ స్థానంలో కొత్తస్లాబ్‌లను వేయాలని సూచించారు. అలాగే ప్రతివీధిలో కుక్కల బెడద అధికంగా ఉందని పరిటాలశ్రీరామ్ దృష్టికి తెచ్చారు.

'అక్రమాలపై విచారణ జరపాలి'

ధర్మవరం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో సర్వే నంబర్ 650-2లో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ, ప్లంబర్స్ అండ్ ఎలెక్ట్రీషన్ కార్మిక సంఘంనాయకులు ధర్నా చేపట్టారు. అందులో పలువురు బినామీ పేర్లతో పట్టాలు పొందారని, వీటిపై విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీపీఐ నాయకులు రవికుమార్, రమణ, చేనేతనాయకులు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు నీడలో..



కదిరి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): తనకల్లు మండలపరిధిలోని సీజీ ప్రాజెక్టు వద్ద గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో చెట్టు నీడే షామియానాలా విద్యార్థినులకు నీడనిస్తోంది. మెగా పీటిఎం సందర్భంగా శుక్రవారం ఆ పాఠశాలల్లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల ఆవరణంలో ఎటువంటి షామి యానా లేకుండా చెట్టు నీడలో కూర్చోబెట్టారు. గుబురుగా, అందగా పాఠశాల ఆవరణమంతా ఆవరించి ఉన్న ఈ చెట్టు సమావేశం ముగిసే వరకు విద్యార్థినులకు నీడ నిచ్చింది.

అట్టహాసంగా మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

● రైతులకు అందుబాటులోఉండాలి: ఎమ్మెల్యే కందికుంట

కదిరి/కదిరి అర్బన్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్‌యార్డు కమిటీ చైర్‌పర్సన్ అనసూయమ్మ, వైస్ చైర్మన్ కొమ్మినేని గంగయ్యనాయుడు శనివారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. చైర్‌పర్సన్ జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ర్యాలీగా రాగా, వైస్ చైర్మన్ కొమ్మినేని గంగయ్యానాయుడు సైదాపురం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలతో అనేక వాహనాల్లో ర్యాలీగా మార్కెట్‌యార్డు వద్దకు చేరుకున్నారు. ఇరువురి ర్యాలీ అంబేడ్కర్ సర్కిల్‌నుంచి కలిసి సాగాయి. దీంతో కదిరిలో పెద్ద ఎత్తున సందడి వాతావరణం నెలకొంది. ఈ ప్రమాణ స్వీరోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, జనసేన జిల్లా నాయకులు వరుణ్, కదిరి ఇన్‌చార్జ్ భైరవప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌యార్డు కమిటీ నిత్యం రైతులకు అందుబాటులో ఉండి, వారికి సహాయ, సహకారాలు అందించాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వం రక్తపాతాన్ని కోరుకుంటే, కూటమి ప్రభుత్వం జలపాతాన్ని కోరుకుందన్నారు. ఇదే రెండు ప్రభుత్వాలకు స్పష్టమైన తేడా అన్నారు. మార్కెట్‌యార్డు కమిటీ నిరంతరం రైతులకు దగ్గరగా ఉండి వారి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. కూటమి నాయకులు ప్రజలవద్దకు వెళ్లాలని సూచించారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఫర్వీనాబాను, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, కూటమి నాయకులు, కార్యకర్తలున్నారు.

భారీగా తరలివచ్చిన కూటమి శ్రేణులు: వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీరోత్సవానికి ముఖ్య అతిథులు హాజరైన ఎమ్మెల్యే కందికుంట తదితరులకు అక్కడ గజమాల తో ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గం నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు తరలిరావడంతో ఆర్ అండ్ బి బంగ్లా నుంచి మార్కెట్ యార్డ్ వరకూ జన సందోహం నెలకొంది. కూటమి నాయకులు కిన్నెర కళ్యాణ్ కుమార్, సుంకర శ్రీనివాసులు, బ్లూమూన్ శివశంకర్, పత్తి చలపతి, తలుపుల గంగాధర, గవ్వల శ్రీనివాసులు, యర్రంశెట్టి రమేష్, దారం అనిత, రవి, జయవర్ధన్, వేణుగోపాల్‌రెడ్డి, తిరుపాల్ యాదవ్, కేశవరెడ్డి, పీట్ల కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.





గజమాలతో ఎమ్మెల్యేని సత్కరిస్తున్న వైస్ చైర్మన్ కొమ్మినేని గంగయ్యనాయుడు,

ప్రమాణ పత్రాన్ని చదువుతున్న వైస్ చైర్మన్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల ఖర్చు కోసం ఆర్థికంగా ఏ ఒక్కరూ నష్టపోకుండా సీఎంఆర్ఎఫ్ ప్రభుత్వం ఆదుకుంటోందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. 106 మంది లబ్ధిదారులకు రూ.40.06లక్షల విలువచేసే చెక్కులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓ వైపు పేదల ప్రభుత్వం అని చెబుతూనే పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాల మాటున దోపిడీకి తెరతీసిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు సారథ్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షులు నాగరాజు, కన్వీనర్లు తిప్పేస్వామి, నాగరాజు, ఈరన్న, లక్ష్మీనరసప్ప తదితరులు ఉన్నారు.

మంత్రికి గుడికట్ల పూజారుల సన్మానం



మంత్రి సవితను సన్మానిస్తున్న గుడికట్ల పూజారులు

పెనుకొండ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గుడికట్ల పూజారులు మంత్రి సవితను శనివారం సన్మానించారు. ధూప దీప నైవేద్యాల కోసం ఇటీవల ప్రభుత్వం వివరాలు సేకరించాలని ఉత్తర్వులు ఇవ్వడంతో హర్షం వ్యక్తంచేస్తూ మంత్రిని వారు సన్మానించారు. సీఎం చంద్రబాబుకు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గోశాల ప్రారంభం



గోశాల ప్రారంభోత్సవంలో జీఎం శేఖర్, నాయకులు

గోరంట్ల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గుమ్మయ్యగారిపల్లి మారెమ్మ ఆలయ ట్రస్టు నిర్వాహకుడు దేవరాజుస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం గోశాల ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ జీఎం సురేష్, ఎంపీ పార్థసారథి అల్లుడు శశిభూషణ హాజరైయ్యారు. గోశాల ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మల విద్యాధరణి, నిమ్మల చంద్రశేఖర్, బోయ లక్ష్మీనారాయణ, సోముశేఖర్, అశ్వర్థరెడ్డి, నీలకంఠారెడ్డి, గిరిధర్‌గౌడ్, నరేంద్ర పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి: ఎంపీడీఓ

అమరాపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్న పాఠశాల మైదానంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మండల వికలాంగుల సమాఖ్య, ఆర్డీటి సంస్థ ప్రోత్సాహంతో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీఓ రామారావు, మడకశిర ఆర్డీటి వికలాంగుల ఎస్టీసెల్ అనసూయ, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్, ఎంఈఓ వెంకటరమణ, మండల వికలాంగుల సంఘం లీడర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'స్క్రబ్ టైఫస్ పట్ల జాగ్రత్తగా ఉండాలి'

సోమందేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్క్రబ్‌టైఫస్ వ్యాధిపట్ల సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రజలకు దీనిపై వివరించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వ్యాధిసోకినవారు తీవ్ర జ్వరం, అవయవాలు దెబ్బతినడం, ఒళ్లునొప్పులు లాంటి లక్షణాలుంటాయన్నారు. అనంతరం ఈనెల 21, 22, 23 తేదీల్లో పోలియో వ్యాక్సినేషన్‌పై వైద్యాధికారిణి ఆశ, వైద్యులు ఓంకార్, సీహెచ్‌ఓలు, ఎఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశలకు శిక్షణ ఇచ్చారు. తొలిరోజు ఆరోగ్యకేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియోచుక్కలు వేయాలన్నారు. తరువాత రోజు ఇంటింటికి వెళ్లి వేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్‌ఓకే పార్వతి, పర్యవేక్షకులు రవీంద్ర, హెచ్‌ఓలు, ఏఓలు ఆశలు పాల్గొన్నారు.

మడకశిరరూరల్(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కదిరేపల్లిలో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ వ్యాధి చిగ్గర్ మైట్ అనే క్రిమి కాటు ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఈ క్రిమి గడ్డివాములు, పొలాలు, పొదలు, పశువుల పాకలు, వ్యవసాయ క్షేత్రాల్లో ఆవాసం ఏర్పరచుకుని ఉంటుందన్నారు. వీటిలో పనిచేసే వారికి అధిక ప్రమాదం పొంచివుంటుందన్నారు. వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ షమీవుల్లా పాల్గొన్నారు.

అట్టహాసంగా మెగా పీటీఎం

● విద్యావ్యవస్థ పటిష్ఠతకు కృషి
- మంత్రి సవిత

జిల్లావ్యాప్తంగా మెగా పీటీఎం 3.0 శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల నడుమ ఆహ్లాదవాతావరణంలో సమావేశాలు జరిగాయి.
ఈ సందర్భంగా విద్యార్థులపట్ల తల్లిదండ్రులు అనుసరించాల్సిన పద్ధతులను ఉపాధ్యాయులు వివరించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు విద్యార్థులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను తల్లిదండ్రులు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశాల్లో కూటమి నాయకులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు చక్కటి సౌకర్యాలు కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులను తీర్చిదిద్దుకోవాలని సూచించారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సవిత

సోమందేపల్లి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చి విద్యావ్యవస్థను పటిష్ఠంచేయడానికి నారాలోకేష్ కృషిచేస్తున్నారని మంత్రి సవిత పేర్కొన్నారు. ఇందులో భాగంగా మెగా పేటీఎం సమావేశాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎల్ఎపి కియా అనుబంధ సంస్థ 1.20కోట్లతో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఆడిటోరియంను ఆమె ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన మెగా పేటీఎం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, మార్షల్ ఆర్ట్స్, నాటికలు ప్రదర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగాన్ని తల్లిదండ్రులు తగ్గించాలన్నారు. సీరియళ్లు పక్కనబెట్టి విద్యార్థులను పట్టించుకోవాలన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. మంచి విద్యా ఇక్కడే సాధ్యమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం అనేకపథకాలు అమలు చేస్తుందన్నారు. జగన్ ప్రభుత్వంలా బొమ్మలను వేసుకోవడం లేదన్నారు.

ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మిస్తాం

జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆటస్థలానికి ప్రహరీలేదని, మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. నిధులు మంజూరుచేసి ప్రహరీ నిర్మించి మరుగుదొడ్లు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థుల భవిష్యత్తే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

● **మడకశిరటౌన్:** విద్యార్థుల బంగారు భవిషత్తు లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. శుక్రవారం పట్టణ సమీపంలోని ఆదిరెడ్డిపాళ్యం ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి మెగా పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మంత్రి నారా లోకేశ్ అనేక మార్పులు తెచ్చారన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని బంగారు భవిషత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, కమిషనర్ జగన్నాథ్, ప్రిన్సిపాల్ సుజాత తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● **గుడిబండ:** విద్యార్థులు బాగా చదివి విద్యతోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. శుక్రవారం గుడిబండ జూనియర్ కళాశాల ఆవరణంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధికి సాధ్యమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ యశ్వంత్‌కుమార్, మంజుళ, హెచ్ఎం గోవిందప్ప, వక్కళిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశాలతోనే సత్సంబంధాలు: కలెక్టర్

● **లేపాక్షి:** మండల కేంద్రంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తుంటే సత్సంబంధాలు మెరుగు పడతాయని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నీలం సంజీవరెడ్డి ప్రభుత్వ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పీటీఎం విద్యార్థులు, తల్లిదండ్రులు, గురువుల మధ్య సత్సంబంధాలు మెరుగు పరుస్తుందని పాఠశాలల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటుచేసిన విజ్ఞాన ఎగ్జిబిషన్‌ను పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, ఫలితాలపై తల్లిదండ్రులతో కలెక్టర్ సమీక్షించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీడీ ప్రత్యేక అధికారి సుదర్శన్, ఎంఈఓ నాగరాజునాయక్, కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు పక్కనపెట్టి పనిచేయండి: కలెక్టర్

లేపాక్షి(ఆంధ్రజ్యోతి): స్థానిక నీలం సంజీవరెడ్డి ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సమావేశం ముగింపు అనంతరం విద్యార్థులతో కలిసి భోజనానికి వెళ్తున్న సమయంలో ఉపాధ్యాయులు కొంతమంది చేతుల్లో సెల్‌ఫోన్‌లో పట్టుకుని ఎదురుబడ్డారు. గమనించిన ఆయన సెల్‌ఫోన్‌లు పక్కనబెట్టి పనిచేయాలని మందలించారు. ఏ సమయంలో సెల్‌ఫోన్‌లు చూడాలి..? ఏ సమయంలో వాడకూడదో మీకుకూడా నేర్పాలా..? అంటూ అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్‌లు జేబులో పెట్టుకుని పక్కకు వెళ్లిపోయారు.

● **హిందూపురం:** ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీప వీరయ్య కోరారు. శుక్రవారం మెగా పీటీఎం కార్యక్రమాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు ఉన్నాయన్నారు. మలుగూరు గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్, సింగిల్ విండో అధ్యక్షులు శంకరప్ప పాల్గొనగా కొట్నూరు పాఠశాలలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, ఎంఈఓ గంగప్ప హాజరయ్యారు. సడ్లపల్లిలో ఉప్పర సగర కార్పొరేషన్ డైరెక్టర్లు మణిప్రియ హాజరయ్యారు.

● **చిలమత్తూరు:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పీటీఎం సమావేశాలను నిర్వహించారు. విద్యార్థులను ఉత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం దోహదపడతాయని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నౌషద్ అలీ, నాయకులు వెంకటేశులు, విశ్వనాథరెడ్డి, మంజు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



హిందూపురంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పీప వీరయ్య, ఎంఈఓ గంగప్ప

● **పరిగి:** మండలంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రెడ్డప్ప ఆధ్వర్యంలో విద్యార్థులు తమ తల్లిదండ్రులను బ్యాండ్ మేళంతో పాఠశాలలోకి స్వాగతం పలికారు. మండలవ్యాప్తంగా కార్యక్రమాలు జరిగాయి. తహసీల్దార్ హసీనాసుల్తానా, ప్రధానోపాధ్యాయులు కృపాసత్యరాజ్, రమాదేవి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్ల యుత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

● **రొద్దం:** మండల పరిధిలోని పాఠశాలల్లో మెగా పీటీఎం సమావేశాలు జరిగాయి. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించినప్పుడే ఆర్థిక అసమానతలు తొలగుతాయని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, ఎంఈఓలు జయభాస్కర్, అరవిందకుమార్, ఎంపీడీఓ ఆనంద్‌ప్రసాద్, వీరాంజనేయులు, నరహరి, ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, హెచ్ఎం లక్ష్మీనారాయణమ్మ, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

● **గోరంట్ల:** మండలపరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మెగా పీటీఎం సమావేశాలు ఘనంగా జరిగాయి. మలసముద్రం పంచాయతీలోని జక్కసముద్రం, మలసముద్రం, కోరేవాండ్లపల్లి పాఠశాలలో జరిగిన సమావేశాలకు సర్పంచ్ సువర్ణ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి హాజరయ్యారు.

● **పెనుకొండ:** ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పీటీఎం 3.0 సమావేశాలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ సెంట్రల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జ్యోతిర్మయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్ హాజరయ్యారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

● **అగళి:** మండల వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్స్‌డే నిర్వహించారు. ఆయా పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మోడల్ పాఠశాలలో తహసీల్దార్ సుబ్బారావు, ఎంపీడీఓ గంగాధ్, చంద్రశేఖర్‌నాయుడు, జడ్పీటీసీ ఉమేష్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమారి పాల్గొన్నారు.

● **అమరాపురం:** మండల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కస్తూరీ బాగాంధీ బాలికల పాఠశాల, డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం ఘనంగా నిర్వహించారు. హేమావతి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ రామారావు మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతినిత్యం పిల్లల నడవడిక, చదువుపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి భావితరాల భవిష్యత్తుకు బంగారుబాట వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు సత్యానారాయణ, వెంకటరమణనాయక్, హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు, పాఠశాల కమిటీ చైర్మన్‌లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● **రొళ్ల:** మండలంలోని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ 3.0 సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్, వ్యవసాయాధికారి వెంకటబ్రహ్మ, మడకశిర మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, టీడీపీ కన్వీనర్ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

రక్షణలేని రక్షకభట నిలయం

పెచ్చులూడుతున్న పోలీస్‌స్టేషన్ పైకప్పు
బిక్కుబిక్కుమంటూ ఉద్యోగాలు చేస్తున్న పోలీసులు
ఫిర్యాదిదారులదీ అదే పరిస్థితి



పెచ్చులూడుతున్న లాకప్ గది పైకప్పు, రాలిపడుతున్న సిమెంట్

సోమందేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు రక్షణ కల్పించే పోలీసులు బిక్కు బిక్కుమంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. భవనం పైకప్పు పెచ్చులూడుతుండటంతో ఎప్పుడేం జరుగుతుందోనని భయపడుతూ విధులు నిర్వహిస్తున్నారు. తమకే రక్షణ లేదని వాపోతున్నారు. సోమందేపల్లి పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఉన్నట్టుండి వరండాలో పైకప్పు పెచ్చులూడి కిందపడుతుండటంతో సిబ్బందితోపాటు ఫిర్యాదు చేసేందుకు వస్తున్న వారు భయాందోళనకు గురవుతున్నారు. కొన్నేళ్లుగా భవనం పైకప్పు పెచ్చులూడుతూనే ఉందని సిబ్బంది చెబుతున్నారు. స్టేషన్‌లో రిసెప్షన్ విభాగం, వరండా, ఎస్ఐ గది, స్టాఫ్, రికార్డ్‌రూమ్స్, కంప్యూటర్ గది, రెండు లాకప్‌లు ఉన్నాయి. పై అంతస్తులో రెండు గదులను ఇటీవల నిర్మించడం జరిగింది. పోలీస్ సిబ్బంది రెస్ట్ తీసుకోవడానికి వాటిని వినియోగిస్తున్నారు. భవనంలో విధులు నిర్వహించడం కత్తిమీద సాములా మారిందని వారు అంటున్నారు. పోలీస్‌స్టేషన్‌కు ప్రతిరోజూ ఏదోసమస్యలపై మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదు చేసేందుకు వస్తుంటారు. ఎస్ఐ గది చాలా చిన్నగా ఉండటంతో వరండాలో రిసెప్షన్ వద్ద బాధితులు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంటోంది. ఇటువంటి సమయంలో భవనం పైకప్పు పెచ్చులూడి పడితే తమ పరిస్థితి ఏంటని ఫిర్యాదుదారులు ప్రశ్నిస్తున్నారు. బుధవారం స్టాఫ్‌రూమ్‌లోని కంప్యూటర్‌లో పనిచేసుకుంటున్న ఓ కానిస్టేబుల్ పక్కనే పెద్ద సిమెంటు పెచ్చులూడి పడింది. కాస్త అటు ఇటు అయినా తీవ్రంగా గాయపడే అవకాశం లేకపోలేదని ఆయన వాపోయాడు.

రూ.5 కోట్లతో ప్రతిపాదనలు

పోలీస్‌స్టేషన్ నూతన భవనం, క్వార్టర్స్ నిర్మాణానికి గతేడాది రూ.5కోట్ల అంచనాతో పోలీసులు ఏపీ హౌసింగ్ పోలీస్ వెల్ఫేర్ సొసైటీకి ప్రతిపాదనలు పంపారు. అయితే ఇప్పటి వరకు పురోగతి లేదు. 1997-98 ప్రాంతంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పోలీస్‌స్టేషన్ నిర్వహణకు 1.90ఎకరాలు కేటాయించింది. జన్మభూమి పథకం కింద పోలీస్‌స్టేషన్ భవనాన్ని నిర్మించారు. అది ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఎన్నిమార్లు మరమ్మతులు చేసినా పైకప్పు నుంచి పెచ్చులూడుతుండటంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి నిధులను మంజూరుచేసి నూతన భవనం, క్వార్టర్స్ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ రమేష్ కోరారు.

స్థల పరిశీలన

గోరంట్ల, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని బస్టాండ్ కూడలిలో ప్రయాణీకుల సౌకర్యార్థం సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి టీడీపీ నాయకులు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, నిమ్మలశ్రీధర్, నాగేనాయక్ తదితరులు చిత్రావతి వంతెన పక్కన బ్రాహ్మణ శ్మశావాటిక వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు.

ఆర్థిక సాయం

అగళి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన మహాలింగప్ప(32) గురువారం ఉరివేసుకుని మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ జడ్పీటీసీ ఉమేష్ ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుడి భార్య శోభకు రూ.8వేలు ఆర్థిక సాయం అందించారు.

బాబయ్య స్వామి చేతికర్ర ప్రదర్శన

పెనుకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బాబయ్యస్వామి ఉరుసు ఉత్సవంలో భాగంగా దర్గాలో భద్రపరిచిన స్వామి వారి చేతికర్ర ప్రదర్శన చేశారు. దర్గా వంశపారంపర్య పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా, ముతవల్లి తాజ్‌బాబా శుక్రవారం తెల్లవారుజామున భక్తులకు స్వామివారి చేతికర్రను దర్శనకు ఉంచారు. అనంతరం చేతికర్రను వివిధరకాల పూలతో అలంకరించి మత పెద్దలు, ఫకీర్లు వెంటరాగా దర్గా చుట్టూ ప్రదక్షణలు(ఆశె) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏడాదిలో ఒకరోజు మాత్రం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పీఠాధిపతి తెలిపారు. అనంతరం సర్వమత శాంతి కోసం ప్రార్థనలు నిర్వహించారు.



చేతికర్రను తీసుకెళ్తున్న దృశ్యం

బైక్ రేసర్ల పడిగాపులు



డీఎస్పీ కార్యాలయంలో పడిగాపులు కాస్తున్న రేసర్లు

పెనుకొండ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బాబయ్య ఉరుసు గంధం మహోత్సవంలో పెనుకొండ సమీపంలో 44వ జాతీయరహదారిపై బైక్‌పై విన్యాసాలుచేస్తూ పోలీసులకు పట్టుబడిన ద్విచక్రవాహనదారులు వారి వాహనాలకోసం డీఎస్పీ కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. బుధవారం తెల్లవారుజామున దాదాపు 116 ద్విచక్రవాహనాలను సీజ్‌చేసి స్థానిక డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. ఈ క్రమంలో మూడు రోజులైనా ద్విచక్రవాహనాలు అప్పగించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో డీఎస్పీ కార్యాలయం వద్దే పడిగాపులు కాశారు. కొంతమంది మేం గంధం ఉరుసుకు వస్తుంటే బైక్‌రైడర్లను పోలీసులు చెదరగొట్టే సమయంలో తమ వాహనాలను తీసుకొచ్చారన్నారు. తమకు బైక్‌రైడర్లకు సంబంధం లేదని, న్యాయం చేయాలని కోరారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ



మైక్‌సెట్ అందజేస్తున్న కన్వీనర్ శ్రీరాములు

పెనుకొండ టౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్లాపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి, టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు రూ.20వేలు విలువచేసే మైక్‌సెట్‌ను అందించారు. శుక్రవారం మెగా పీటీఎంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హనుమంతు పాల్గొన్నారు.

రోడ్లపైకి మురుగునీరు వదిలితే కొళాయి కనెక్షన్ కట్

పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి



నోటీసులు అందజేస్తున్న సిబ్బంది

రొద్దం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శేషాపురం బీసీ కాలనీలో రోడ్డుపైకి మురుగునీరు వదిలితే ఇంటి కొళాయి కనెక్షన్లు కట్ చేస్తామని పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం కలిపి పంచాయతీలో నోటీసులు అందించారు. గ్రామంలో అనేకమంది రోడ్డుపైకి మురుగునీరు వదులుతుండటంతో రహదారులు బురదమయంగా మారుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిమార్లు చెప్పినా మార్పు రావడంలేదని, ఈసారి ఎవరైనా మురుగునీరు రోడ్లపైకి వదిలితే వారి కొళాయి కనెక్షన్ కట్‌చేస్తామని తీవ్రంగా హెచ్చరికలు జారీచేశారు.

అభివృద్ధికి అడ్డుపడొద్దు

మాజీ మంత్రి వెంకటరమణప్ప



జ్యోతి వెలిగిస్తున్న మాజీ మంత్రి తదితరులు

పావగడ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పనులకు అడ్డుపడకుండా అండగా నిలిస్తే అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి వెంకటరమణప్ప పేర్కొన్నారు. శుక్రవారం తిరుమణి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని సూచించారు. రూ.70లక్షలతో నూతన భవనాన్ని నిర్మించడం జరిగిందని ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ తెలిపారు. రానున్న రోజుల్లో సీఎస్ఆర్ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు సోలార్‌సీఓ అమర్నాథ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ టీపీఎస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణప్ప, రామచంద్రరెడ్డి, శివప్రసాద్, నల్లూరి నరేంద్ర, గ్రామ పంచాయతీ అధ్యక్షులు లక్ష్మీదేవమ్మ, ఉపాధ్యక్షులు చందన, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా వీరభద్రస్వామి బ్రహ్మరథోత్సవం

గుమ్మఘట్ట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లకెరలో శుక్రవారం వీరభద్రస్వామి బ్రహ్మరథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజ నిర్వహించారు. రథోత్సవాన్ని పురవీధుల్లో నందికోలాటాల మధ్య చేపట్టారు. రథోత్సవానికి కర్ణాటక పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు హాజరయ్యారు. టీడీపీ కన్వీనర్ కాలవ సన్నన్న, మాజీ కన్వీనర్ గిరిమల్లప్ప, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు శ్రీరాములు స్వామి వారికి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.